₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 03

ఫిబ్రవరి 01-15, 2019



# రిజర్వేషన్లలో మాట్లు కాదు... సంస్కరణలు కావాలి



# పౌరసత్వం, నాయకత్వాలతోనే యువత ప్రభావం చూపగలరు



కేవలం జనాభా ఉండటం వల్ల పెద్ద మార్కెట్‌గా తయారవుతున్నాం తప్ప సుస్థిరాభివృద్ధికి తగిన పునాదులు మన దేశానికి లేవని, అత్యధిక యువజనాభా శక్తిని భారత్ సద్వినియోగం చేసుకోవాలంటే.... యువతీయువకులు పౌరసత్వాన్ని, నాయకత్వ లక్షణాల్ని పెంపొందించుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

విద్యార్థుల్లో ఎంటర్‌ప్రెన్యూర్ లక్షణాలను పెంపొందించటానికి వాసవి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల బృందం 'స్వయం' ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని జేపీ ప్రారంభించారు.

విద్యార్థి దశలోనే వ్యవస్థాపక లక్షణాలను పెంపొందించుకోవాలని జేపీ అన్నారు. నూతన ఆలోచనా విధానాలతో ఎప్పటికప్పుడు సమస్యల్ని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలన్నారు. పారిశ్రామిక రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజానికి ఉపయోగపడుతూ ఉపాధి పొందేందుకు సొంతంగా ప్రయత్నించే శక్తిని పెంపొందించుకోవాలన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమన్వయకర్త స్వర్ణన్ మాట్లాడుతూ, కళాశాలలో స్వయం అభివృద్ధి ఈ - సమ్మిట్ వ్యవస్థను ప్రారంభించి ఆసక్తిగల విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

భిన్న పుస్తకాలను చదవటం ద్వారా అన్ని రంగాల్లో పరిజ్ఞానం సంపాదించవచ్చని మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ చోలేటి అన్నారు. స్పష్టమైన విజన్ లేకపోవటంతో దాదాపు 95 శాతం అంకుర పరిశ్రమలు కేవలం మూడు సంవత్సరాల్లో మూత పడుతున్నాయని ఇతర వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలోచనతోపాటు ఎలా అమలు చేస్తున్నామన్నదానిపై కూడా విజయం ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ రామ్మోహన్ , సీఈవో బాలాజీ, ప్రిన్సిపల్ రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఫిబ్రవరి 1-15, 2019 సంపుటి - 10 సంచిక - 03


## కార్టూన్ కార్నర్




మీరడిగిన డబ్బు బిచ్చమెత్తి తెచ్చాం సార్, నాలుగైదు రూపాయలు తక్కువున్నాయి. వాటికి బదులుగా చద్దన్నం చింతకాయ పచ్చడీ పచ్చిపులుసూ వేశారు తీసుకోండి!

## లోపలి పేజీల్లో...


పోటాపోటీ జనాకర్షణ రాజకీయ చిట్కా......... 5

రిజర్వేషన్లలో మాట్ల కాద... సంస్కరణలు........... 11

నిజమైన 'ప్రజాస్వామ్యం'తోనే కులరహిత.......... 17

ఈతరం కూడా తెలుసుకోవాల్సన జీవితం........ 20

వైరల్ అబద్ధాలను అరికట్టే 'ఫ్యాక్ట్ చెకర్స్'........... 23

ఎ.పి.కి విభజన హామీలపై స్వతంత్ర నిపుణుల...... 25

ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు చేయని పనిని....... 27

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర......... 28

సమాజహితంలోనే వ్యక్తి ప్రయోజనమూ .......... 33

పోస్టాఫీసులను నిరంతర ఓటరు నమోదు.......... 34



### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి.కుటుంబరావు


### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**

**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


FOLLOW ME ON
twitter
Friends, Interacting with youngsters always gives me immense pleasure. You can tweet your suggestions , ideas , queries to :
@JP_LOKSATTA
I will try to respond to as many as possible
DR.JAYAPRAKASH NARAYAN, FOUNDER, LOKSATTA

# పోటాపోటీ జనాకర్షణ రాజకీయ చిట్కా - 10 శాతం కోటా

**మా**జీ ప్రధాని ఇందిరాగాంధీ గురించి ఒక మాట ప్రముఖంగా చెలామణిలో ఉండేది. 'ఆమె ఆలోచించేది చెప్పరు, చెప్పింది చెయ్యరు'. ఇందిర స్టయిల్‌ను ఎక్కువగా ఇష్టపడే ప్రస్తుత ప్రధాని మోదీ కూడా ఆ తరహాలోనే పనులు పూర్తి చేస్తుంటారు. అయితే ఇందిర కంటే ఒక ఆకు ఎక్కువే అన్నట్లు ఆలోచనల్లో కూడా సందిగ్ధతను కొనసాగిస్తుంటారు. తన మనసులోని ఆలోచనల్లో కూడా స్పష్టత రానీయకుండా కుడి భాగం, ఎడమ భాగం పోటాపోటీ పడుతున్నట్లు మోదీ రకరకాల ఆలోచనలను ఏకకాలంలో చేస్తుంటారు. తనకు బాగా నమ్మకం కుదిరాకో లేక తనకున్న నాటకీయ వ్యవహార శైలి బలహీనతతోనో ఒక ఆలోచనను స్పష్టతతో తనకున్న నమ్మకస్తులైన ఉన్నతాధికారుల కోటరీ వద్ద బైటపెట్టాక కూడా.. చర్చించేందుకు, విశ్లేషించేందుకు, లిఖితపూర్వకంగా వెల్లడించేందుకు మోదీ పెద్దగా ఇష్టపడరు. కన్ఫ్యూజన్‌లో ఫ్యూజన్ అన్నట్లుగా గందరగోళం నుంచి లబ్ధి పొందేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తుంటారు. ఈ నేపథ్యమంతా, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆమోదించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లు (103వ రాజ్యాంగ సవరణ) వెనుక ప్రతిఫలిస్తుంది.

జనవరి 7న రూపొందించి, జనవరి 9న పార్లమెంటు రెండు సభలతోనూ ఇంత కీలక బిల్లును ఆమోదింప చేయటం న్యాయమా? అని ప్రశ్నిస్తున్న వారు ఈ నేపథ్యాన్ని గుర్తించాలి. మోదీ బైటికి వెల్లడించకపోవచ్చు, కానీ ఆయన మనసుకు కూడా స్పష్టత లేకుండా ఈ ఆలోచనలు కొన్ని నెలలుగా ఆయన మెదడులో తిరుగాడుతున్నాయని, యధావిధిగా ఆయన సన్నిహితులకు మాత్రమే ఈ విషయం గురించి అస్పష్టంగా తెలుసని అర్థం చేసుకోవాలి. పైగా ఎప్పుడో 30 ఏళ్ల క్రితం ప్రధాని



పి.వి నరసింహారావు ఈ ప్రయత్నం చేయనే చేశారు. సుప్రీంకోర్టు జోక్యంతో అది విఫలమయ్యాక కాంగ్రెస్ పార్టీ తిరిగి ఆ ప్రయత్నం చేయకపోయినా.. దాన్ని వదిలి పెట్టేయలేదు. 'ఆర్థికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్ కల్పిస్తామని' ఎన్నికల ప్రణాళికలో హామీని గుప్పించింది (మోదీ కన్ఫ్యూజన్‌లో ఫ్యూజన్‌ను డిఫ్యూజ్ చేయటానికి ప్రియాంకను రంగంలోకి దించటంతోపాటు.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇంకో రెండంకెల శాతం రిజర్వేషన్లకు హామీ ఇస్తుందన్న ఊహాగానాలు ఇప్పటికే మొదలయ్యాయి). అయితే, ప్రచారంలో మినహాయించి పాలనలో తనకంటూ ప్రత్యేకమైన కొత్త ఆలోచనలు లేకపోయినా, యూపీయే హయాంలో పట్టించుకోకుండా వదిలేసిన ఆలోచనలను ఉపయోగించుకుని తనవిగా ప్రచారం చేసుకోవటంలో ఆరితేరిన మోదీ.. పెద్ద నోట్ల రద్దు కొండను తవ్వి ఎలకను కూడా పట్టనట్లు తయారవటం, నిరుద్యోగం భారీగా పెరగటం, వ్యవస్థలు ధ్వంసమవ తుండటం వంటి కారణాలతో తన పట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను చల్లార్చటానికి, కోటా కోసం ఆందోళనలు చేస్తున్న గుజ్జర్లు, పటేళ్లు వంటి వారిని ఆకట్టుకునేందుకు– తాజాగా రిజర్వేషన్లను ఒక అస్త్రంగా ఉపయోగించుకున్నారు. కాబట్టి.. బిల్లు చుట్టూ హడావుడి మీద కన్నా, బిల్లులోని అంశాలను చర్చించి ఉంటే ప్రతిపక్షాలు ప్రజలకు ఎక్కువ మేలు చేసి ఉండేవి.

### ఇంతవరకూ రిజర్వేషన్లు వర్తించనివారిలో ఆర్థికంగా బలహీనులకు

'ఇంతవరకూ రిజర్వేషన్లు వర్తించనివారిలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం కల్పించటమే తమ ఉద్దేశమని' లోక్‌సభలో బిల్లును ప్రవేశపెడుతూ ప్రభుత్వం పేర్కొంది.

'ప్రస్తుతం ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలు ఉన్నత విద్యాసంస్థల్లో

### 5.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి

విద్యా, ఉద్యోగ సంస్థల్లో ఈడబ్ల్యూఎస్/ఈబీసీల (ఆర్థికంగా బలహీన వర్గాల)కు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్రం తీసుకొచ్చిన చట్టం వల్ల దేశవ్యాప్తంగా 5.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని 'బిజినెస్ స్టాండర్డ్' సర్వే అంచనా వేసింది. వీటిలో 93.5 లక్షల బ్రాహ్మణ కుటుంబాలుండగా (దేశం మొత్తమ్మీద 1.25 కోట్ల బ్రాహ్మణ కుటుంబాలున్నాయి).. 4.21 కోట్ల కుటుంబాలు ఇతర వర్ణాలకు చెందినవిగా వెల్లడైంది. పదిశాతం కోటా వల్ల పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు ఎక్కువ లబ్ధి పొందుతాయని, దేశవ్యాప్తంగా మొత్తం కుటుంబాల్లో 42 శాతం ఈ మూడు రాష్ట్రాల్లోనే ఉన్నాయని సర్వే తెలిపింది. మేరీల్యాండ్ యూనివర్సిటీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనామిక్ రీసెర్చ్‌లు చేపట్టిన 'ఇండియన్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే' (ఐహెచ్‌డిఎస్) గణాంకాల ప్రకారం 2016-17 ఆదాయ రికార్డుల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్లు పేర్కొంది. రాష్ట్రాలవారీగా చూస్తే ఈ కోటా వల్ల లబ్ధి పొందే కుటుంబాల్లో 17.2 శాతం పశ్చిమ బెంగాల్‌లో, 13.3 శాతం ఉత్తర ప్రదేశ్‌లో, 12 శాతం మహారాష్ట్రలో, 5.8 శాతం ఆంధ్రప్రదేశ్‌లో, 5.4 శాతం గుజరాత్‌లో, 5 శాతం బీహార్‌లో, 4.8 శాతం మధ్యప్రదేశ్‌లో ఉన్నాయి. మిగతా రాష్ట్రాలన్నీ కలిపి 36.5 శాతం ఉన్నాయి. ఈ కుటుంబాల్లో మూడింట రెండొంతులు గ్రామాల్లోనే నివసిస్తున్నాయని సర్వే తెలిపింది.

ప్రవేశాలు, ప్రభుత్వోద్యోగాలు పొందడంలో ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నవారితో పోటీ పడలేకపోతున్నారు. వాటికి వారు దూరమవుతున్నారు. దీని దృష్ట్యా రాజ్యాంగంలోని 15వ అధికరణను సవరించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ప్రజల్లో ఆర్థికంగా వెనుకబడిన ఏ వర్గానికైనా ప్రయోజనాలు కల్పించడానికి రాష్ట్రాలకు ప్రత్యేక అనుమతి లభించేందుకు వీలుగా ఒక నిబంధనను చేర్చాలనేది ప్రతిపాదన. అన్ని విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఈ నిబంధనలు వీలు కల్పిస్తాయి. ప్రస్తుత రిజర్వేషన్లకు ఇవి అదనం. ప్రతీ విభాగంలో ఉన్న మొత్తం సీట్లలో గరిష్ఠంగా 10 శాతానికి మించకుండా ఈ రిజర్వేషన్‌ను వర్తింప చేస్తాం" అని బిల్లులో చెప్పారు.

'రాజ్యాంగంలోని 46వ అధికరణలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాల ప్రకారం బలహీన వర్గాల ప్రజల, ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టిల విద్య, ఆర్థిక ప్రయోజనాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనవరచాల్సి ఉంది. సామాజిక అన్యాయాలు, అన్ని రూపాల్లోని దోపిడీ నుంచి వారిని పరిరక్షించాలి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు ప్రస్తుత రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడానికి అర్హులు కారు. 46వ అధికరణను పూర్తిస్థాయిలో నెరవేర్చడానికి, ఆర్థికంగా బలహీనంగా ఉన్న పౌరులు విద్య, ఉద్యోగ రంగాల్లో సముచిత అవకాశాలు పొందడానికి భారత రాజ్యాంగాన్ని సవరించాలని నిర్ణయించాం' అని బిల్లు లక్ష్యాల్లో ప్రభుత్వం పేర్కొంది.

#### కొత్తగా క్లాజుల జోడింపు

తదనుగుణంగా ఆర్టికల్ 15, 16కు క్లాజులు చేర్చారు.

రాజ్యాంగం 15వ అధికరణంలో ఇప్పటికే ఉన్న 5 నిబంధనలకు తోడు మరో నిబంధనను చేర్చారు. ఈ ఆరో నిబంధన ఏమిటంటే.. "(ఎ) ఈ అధికరణంలోని 4, 5 క్లాజులలో ప్రస్తావించిన వర్గాలు కాకుండా ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల అభ్యున్నతికి ఏ ప్రత్యేక చర్య అయినా ప్రభుత్వం తీసుకోవచ్చు. (బి) ఆర్థిక బలహీన వర్గాలకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో (ఎయిడెడ్ లేదా అన్‌ఎయిడెడ్) ప్రవేశం విషయంలో మొత్తం సీట్లలో పది శాతం రిజర్వేషన్ ఇప్పుడున్న దానికి అదనంగా కల్పించాలి". అదే విధంగా ఆర్టికల్ 16 కింద కూడా అదనంగా ఒక నిబంధన (క్లాజ్-6) చేర్చారు. దీని ప్రకారం- "వివిధ నియామకాల్లో ఆర్థికంగా బలహీన వర్గాల వారికి మొత్తం పోస్టుల్లో పది శాతం కేటాయించాలి. ఇవి ప్రస్తుత రిజర్వేషన్లకు అదనం. ఇదే అధికరణం కింద- నాలుగో నిబంధనల్లో పేర్కొన్న వర్గాలు కాకుండా అదనంగా ఈ ఈడబ్ల్యూసీ (ఈడబ్ల్యూఎస్/ఈబీసీ) వర్గాలకు కేటాయించాలి". అధికరణ 15 (5) ప్రకారం, రిజర్వేషన్లను చట్టరీత్యా (బై లా) కల్పించాలి. అయితే జోడించిన క్లాజులో 'చట్టరీత్యా' అనే పదాన్ని తొలగించారు. ఆర్టికల్ 16 (4).. ప్రభుత్వోద్యోగాలలో సరైన ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలవారికి రిజర్వేషన్లు కల్పించాలని చెబుతోంది. ఆర్టికల్ 16కు కొత్తగా కలిపిన 5వ క్లాజు (16 (5))లో 'ప్రభుత్వోద్యోగాలలో సరైన ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలు' అనే మాటలను తొలగించారు.

**రిజర్వేషన్లపై రాజ్యాంగం ఏం చెప్పింది?**

అంటరానితనం కారణంగా అనాదిగా నిరాదరణకు, వివక్షకు గురవుతున్న ఎస్.సి, ఎస్.టి, వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని భారత రాజ్యాంగం నిర్దేశించింది. వ్యక్తులు, కుటుంబాలకు లబ్ధి గురించి రాజ్యాంగం ప్రస్తావించలేదు.

**ఎవరికి రిజర్వేషన్లు ఇచ్చారు - పరిణామక్రమం**

అణగారిన వర్గాలుగా భారత ప్రభుత్వం గుర్తించి, నిర్దేశించిన షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్.టి), ఇతర వెనుకబడిన తరగతు (ఓబీసీ)లకవారికి రిజర్వేషన్లు కల్పించారు. కొన్ని రాష్ట్రాల్లో ముస్లింలకూ బీసీ (ఎం/ఈ) కింద రిజర్వేషన్లు ఇచ్చారు. భారత రాజ్యాంగం, చట్టాలు, స్థానిక నియమ నిబంధనలు ప్రాతిపదికగా ఇవి అమల్లోకి వచ్చాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం చూస్తే, బ్రిటీష్ ఇండియాలో కూడా కొన్ని కులాలు, వర్గాలకు కోటా విధానం ఉండేది. కొల్హాపూర్ సంస్థానాధీశుడు సాహూ మహరాజ్ బ్రాహ్మణేతరులు, వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. 1902లో ఇది అమల్లోకి వచ్చింది. 1932లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో రిజర్వేషన్లకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. బ్రిటీష్ ప్రధాని రామ్‌సే మెక్‌డొనాల్డ్ 'కమ్యూనల్ అవార్డు'ను ప్రతిపాదించారు. దీని ప్రకారం ముస్లింలు, సిక్కులు, భారత క్రైస్తవులు, ఆంగ్లో ఇండియన్లు, యూరోపియన్లు, అణగారిన వర్గాల వారికి ప్రత్యేక కోటా ప్రాతినిధ్యం కల్పించారు. దీన్ని గాంధీజీ వ్యతిరేకించగా.. అంబేద్కర్ సమర్థించారు.

దేశ స్వాతంత్ర్యానంతరం ఎస్.సి, ఎస్.టి, బి.సిల రిజర్వేషన్లకు సంబంధించి కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఎస్.సి, ఎస్.టిలకజనాభా ప్రాతిపదికన.. విద్యాసంస్థల్లో 20 శాతం సీట్లను ప్రత్యేకించాలని విద్యామంత్రిత్వ శాఖ 1950లో ప్రతిపాదించింది. ఆ తర్వాత ప్రభుత్వ రంగం, ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థలతోపాటు, ఉద్యోగాల్లో ఎస్.సిలకు 15 శాతం, ఎస్.టిలకు 7.5 శాతాల్ని జనాభా ప్రాతిపదికన రిజర్వు చేశారు.

ఆ తర్వాత మండల్ కమిషన్ వచ్చింది.

దేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల స్థితిగతుల్ని అధ్యయనం చేసి, సిఫార్సులు చేయడం కోసం 1979 జనవరి 1వ తేదీన అప్పటి మొరార్జీ దేశాయ్ నాయకత్వంలోని జనతా పార్టీ ప్రభుత్వం బి.పి మండల్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఓబీసీల జన సంఖ్య ఎంత అన్న గణాంకాలు అప్పటికి కమిషన్ వద్ద లేవు. దాంతో అది 1931 నాటి జనాభా లెక్కల్ని వినియోగించుకుని వారి జనాభా 52 శాతంగా నిర్ధారణకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వంలోని సేవలు, సంస్థల ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఉన్నత విద్యాసంస్థల్లో ఇదే రిజర్వేషన్ల అమలుకూ మార్పులు చేయాలని సూచించింది. దీనివల్ల కేంద్రంలో ఎస్.సి, ఎస్.టి, బి.సిల మొత్తం రిజర్వేషన్లు 49.5 శాతానికి చేరుకున్నాయి. మండల్ సిఫార్సుల్ని అమలు చేస్తామని 1990ల సమయంలో వి.పి సింగ్ ప్రభుత్వం ప్రకటించటంతో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున విద్యార్థి ఉద్యమాలు చెలరేగాయి. అప్పటికి సుప్రీంకోర్టు తాత్కాలికంగా స్టే ఇచ్చినా.. ఆ తర్వాత రిజర్వేషన్ల అమలు మొదలైంది.

'2005లో రాజ్యాంగానికి 93వ సవరణ చేస్తూ ఆర్టికల్ 15లో 4, 5 నిబంధనలను, ఆర్టికల్ 16లో 4వ నిబంధనను చేర్చారు. ఎస్.సిలు, ఎస్.టిలు, నిమ్నవర్గాల వారు విద్యాపరంగా, సామాజికంగా అభ్యున్నతి సాధించేలా ఏర్పాట్లు చేశారు. కానీ ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల వారిని ఆనాడు పట్టించుకోలేదు. అందువల్ల, ఆర్టికల్ 46వ అధికరణంలో పేర్కొన్న ఆదేశిక సూత్రాల స్ఫూర్తిని కాపాడేందుకు ఈ కోటా అవసరం' అని ప్రభుత్వం బిల్లులో పేర్కొంది.

## 59.5 శాతానికి చేరిన రిజర్వేషన్లు

ఉన్న రిజర్వేషన్లతో సంబంధం లేకుండా ఈబీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ పది శాతంతో కలుపుకుని మొత్తం రిజర్వేషన్లు దాదాపు 59.5 శాతానికి చేరాయి. ఇది సుప్రీంకోర్టు తీర్పునకే కాకుండా, అసలు రిజర్వేషన్ల మౌలిక స్వభావానికి కూడా ప్రశ్నల్ని సంధిస్తోంది. అగ్రవర్ణాలు అంటూ ప్రత్యేకించి పదాలు వాడనప్పటికీ.. ఈ రిజర్వేషన్లు ప్రధానంగా వారిని ఉద్దేశించనవేనని స్పష్ట

### వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్లు

రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పినప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు స్థానిక రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని అంతకుమించి రిజర్వేషన్లను ఇస్తున్నాయి. కొన్నింటిపై కోర్టులు స్టే ఇచ్చాయి.

హర్యానా - 70 శాతం రిజర్వేషన్లు:

(ఎస్.సి- 20 శాతం, బి.సి ఏ- 16శాతం, బి.సి బి- 11 శాతం, ప్రత్యేక వెనుకబడిన తరగతులు- 10 శాతం, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు- 10 శాతం, వికలాంగులు- 3శాతం).

తమిళనాడు - 69 శాతం

(ఎస్.సి- 18 శాతం, ఎస్.టి- 1 శాతం, బి.సి- 20శాతం, ఎం.బి.సి- 30 శాతం).

మహారాష్ట్ర - 68 శాతం

జార్ఖండ్ - 60 శాతం

మవుతున్నాయి. రిజర్వేషన్ల ఏర్పాటు వెనుక ఉన్న వివక్ష అనే ప్రాతిపదికను కూడా ఇది దెబ్బతీస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వృత్తిపరంగా, వ్యవసాయం నుంచి వార్షికాదాయం ఎనిమిది లక్షలకన్నా తక్కువ కలవారు (ఇది బీసీ క్రీమీ లేయర్‌తో సమానం), అయిదెకరాల వ్యవసాయ భూమి, వెయ్యి చదరపు అడుగులకన్నా తక్కువ విస్తీర్ణంలో ఇళ్లు కలవారు, నోటిఫైడ్ మునిసిపల్ ప్రాంతాల్లో వంద గజాలు, నాన్‌నోటిఫైడ్‌లో రెండొందల గజాల కన్నా తక్కువ స్థలంలో ఇళ్లు ఉన్నవారు తాజా రిజర్వేషన్ పొందటానికి అర్హులన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కూడా పలు విమర్శలకు తావిస్తోంది. పేదరిక ప్రమాణానికి దాదాపు పదహారు రెట్లు ఎక్కువ ఆదాయమున్న వారిని ఈ రిజర్వేషన్ పరిధిలో చేర్చటం, భూములకు ఒక్కో చోట ఒక్కో రేటు ఉండటం వంటి వాటిని ఎత్తిచూపుతూ తీవ్ర విమర్శలు కొనసాగుతున్నాయి. అలాగే రిజర్వేషన్ల పరిధిలోకి దాదాపు జనాభాలోని అందరూ వచ్చేస్తారు అనే అంచనాల పట్ల కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ కోటాలో భర్తీ కాకపోవడం అంటూ ఉండదని కొందరంటుండగా, ఒకవేళ భర్తీ కాకపోతే వెనుక బడిన, ఇతర రిజర్వేషన్ కేటగిరీలకు చెందిన వారు కూడా తమ కులధ్రువీకరణ పత్రాన్ని సమర్పించకుండా దరఖాస్తు చేసుకోవచ్చని లెక్కలేస్తున్నారు. వీటన్నిటనిటితోపాటు.. ఈ కోటా న్యాయసమీక్షకు నిలవదంటున్నారు. ఇప్పటికే ప్రజాప్రయోజన వ్యాజ్యాల దాఖలు మొదలైంది.

**అవరోధాల కన్నా లోతైన అంశాలు చర్చలో కీలకమైనవి**

అయితే, ఇన్ని విమర్శలు, అవరోధాలకన్నా పాలన, దేశ భవిష్యత్తు, ప్రజాస్వామిక పటిష్టతకు సంబంధించిన కీలక కోణాలు ఈ చర్చలో అత్యంత ముఖ్యమైనవి.

రిజర్వేషన్లనేవి తాత్కాలికంగా చేసే ఒక ప్రత్యేక ఏర్పాటు మాత్రమేనని బాబాసాహెబ్ అంబేద్కర్ సైతం భావించినప్పటికీ, స్వతంత్ర భారతదేశంలో దశాబ్దాల పాలనా వైఫల్యం వల్ల వాటిని ఇంకా కొనసాగించాల్సి ఉందనటంలో సందేహం లేదు. శతాబ్దాల పర్యంతం అమానుషంగా, ప్రపంచంలో మరేదేశంలోనూ లేనిరీతిలో మనదేశంలో కోట్లమందిని కులం పేరుతో అణగదొక్కారు. స్వర్ణయుగం అని చాటుకునే కాలంలోనూ కుల రక్కసి కొనసాగింది. ఆ రోజుల్లో ప్రజలు ఎంతో ఆనందంగా బతికారు అంటే.. బానిసలకూ ఆనందం ఉంటుందని మనం అనుకోవాలన్నమాట! ఈ వివక్ష నుంచి శాశ్వత విముక్తిని కలిగించే శక్తి రిజర్వేషన్లకు లేకపోయినా, కనీసం కొంత పరిహారంగా, నైతిక స్పందనగా వాటిని అణగారిన కులాలకు కల్పించటం అవసరం. వీటిని యధాతథంగా కొనసాగించాలి.

అయితే కేవలం కులం కారణంగానే కాకుండా, డబ్బు లేకపోవటం, తల్లిదండ్రులకు చదువు లేకపోవటం, గ్రామీణ నేపథ్యం వల్ల కూడా అవకాశాల్ని కోల్పోతున్నవారున్నారు. ఇదో రకమైన వివక్ష అనటంలో సందేహం లేదు. పల్లెటూర్లో ఒక సాధారణ కుటుంబానికి చెందిన అమ్మాయి నూటికి ఎనభై మార్కులు తెచ్చుకుంటే, పట్టణంలో ఒక సంపన్నుడి కొడుకు ట్యూషన్లకు వెళ్లి మరీ అదే పరీక్షలో నూటికి ఎనభై అయిదు మార్కులు తెచ్చుకుంటే ఎవరు తెలివైనవారు? ఎవరికి ఎక్కువ

**సుప్రీంకోర్టు ఏం చెప్పింది?**

రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు 1992లో తేల్చి చెప్పింది. అలా దాటితే.. రాజ్యాంగం ప్రస్తావించిన సమానత్వ హక్కు ఉల్లంఘన జరిగినట్లేనని వ్యాఖ్యానించింది.

ప్రతిభ ఉంది?.. నిస్సందేహంగా ఆ గ్రామీణ అమ్మాయికే ఎక్కువ ప్రతిభ ఉన్నట్లు! కచ్చితంగా ఆ అమ్మాయికే ముందు అవకాశం లభించాలి. ఇలాంటి వివక్షలను సరిచేయకపోతే, పేరుకు అగ్రకులంలో ఉన్నా సాటివారితో పేదపిల్లలు పోటీ పడలేరు. మరోవైపు, అణగారిన కులాల వారికి న్యాయంగా అందాల్సిన రిజర్వేషన్ల పట్ల కూడా ఆ అగ్రకుల పిల్లల్లో విద్వేషం పెరుగుతుంటుంది. ఈ జీరోసమ్ రాజకీయ క్రీడ వల్ల విద్వేషాలు ఏదోకరూపంలో కొనసాగుతూ రాజకీయ పార్టీలకు ఓట్లు వస్తాయేమోగానీ, సమాజం తీవ్రంగా నష్టపోవటం తరతరాల కథలాగా కొనసాగుతుంది. అందుకే అగ్రకులాల్లో రిజర్వేషన్ తరగతివారిలాగా.. అగ్రకులానికి–రిజర్వేషన్ కులానికి మధ్య సన్నని గీతలో ఉన్న ఆర్థికంగా వెనుకబడిన వారికి కూడా రిజర్వేషన్ల తరహాలో విద్య, ఉపాధి రంగాలలో ఏదోకరకమైన 'ప్రత్యేక మినహాయింపుల్ని' వర్తింప చేయటం అవసరం. అయితే, వీటిని ఇప్పుడు తాజా రాజ్యాంగ సవరణతో ఇస్తున్నట్లు, రిజర్వేషన్ల రూపంలో కాకుండా.. పోటీ పరీక్షల్లో 'అదనపు మార్కుల్ని కలపటం' పద్ధతిలో ఇవ్వటం మేలు. దీనివల్ల రిజర్వేషన్ల పరిమితి 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులకు భంగం కలిగించాల్సిన అవసరం రాదు, మరోవైపున రిజర్వేషన్లు శాశ్వత పరిష్కారమనే భ్రమ సమాజంలో పెరగదు!

ఈ తరహా అదనపు మార్కులకు అర్హులెవరో తేల్చటానికి దొంగ సర్టిఫికెట్లకు అవకాశమున్న పద్ధతుల్ని కాకుండా, ఆచరణాత్మక పద్ధతుల్ని అవలంబించొచ్చు. తల్లిదండ్రుల చదువు, పిల్లలు చదివే స్కూలు, గ్రామీణ నేపథ్యం వంటి కొలమానాలతో అర్హులెవరో తేలిగ్గా నిర్ణయించొచ్చు. ఈ పని చేయకుండా మోదీ ప్రభుత్వం నాటకీయతకు ప్రాధాన్యతనిచ్చి, ఉన్న కోటాకి అదనంగా పది శాతం జోడించింది. ఆదాయపు పన్నును మించిన ఆదాయాన్ని కొలబద్దగా నిర్ణయించటం వంటి విన్యాసాలు చేసింది.

మరోవైపు, రిజర్వేషన్లకు ఎంతో డిమాండ్‌ను కలిగిస్తున్న ఉపాధి విషయంలో మన వైఫల్యానికి మూలం పాఠశాల విద్యలో ఉంది. మన పాఠశాల విద్య అధ్వాన్నంగా ఉందని, స్కూలు విద్యా ప్రమాణాలు 2008తో పోలిస్తే ఇంకా దిగజారాయని 'అసర్' తాజా సర్వే (2018) వెల్లడించింది. 8వ తరగతిలో 56 శాతం మంది మూడెంకెలను ఒక అంకెతో భాగాహారం చేయలేరని బైటపెట్టింది. 2008లో 37 శాతం మంది 5వ తరగతి విద్యార్థులు సాధారణ లెక్కలను చేయగల సామర్థ్యంతో ఉండగా, 84.8 శాతం 8వ తరగతి విద్యార్థులు 2వ తరగతి పాఠ్యపుస్తకాల్ని చదవగలిగేవారని, ఇప్పుడు వారి సంఖ్య వరుసగా 28, 72.8 శాతాలకు పడిపోయిందని పేర్కొంది. డబ్బున్నవారి పిల్లలు భారీ మొత్తాల్ని వెచ్చించి ఏదోక రూపంలో మెరుగైన విద్యను పొందగలుగుతున్నారు. కానీ ఎవరి కోసమైతే రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్నారో, ఆ వర్గాల, కులాల పిల్లలే ప్రభుత్వ స్కూళ్లలో, తక్కువ స్థాయి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతూ 'అసర్' వంటి సర్వేల్లో వెలుగు చూస్తున్న నాసిరకం చదువును పొందుతున్నారు. రిజర్వేషన్లతో సంబంధంలేకుండా ఉన్న పాఠశాలను విద్యను బాగు చేయకుండా.. ఉన్నత విద్యలో, ఉద్యోగాల్లో కోటాలు అంటే ఎవరికి మేలు చేస్తున్నారు? ఏం మాట్లాడుతున్నారు?

**ఎన్ని ప్రభుత్వోద్యోగాలున్నాయి, ఎంతమందికి అందులో ఉపాధిని ఇవ్వగలరు?**

మరోవైపు, ప్రభుత్వోద్యోగాలంటే దోపిడీకి, పనిచేయకుండా జీవితాంతం దర్జాగా వెలగబెట్టడానికి మారుపేరుగా తయారుచేసి, వాటి చుట్టూ యువత ఎగబడేలా చేసి, రిజర్వేషన్ల పేరుతో ఆశల్ని పెంచుతున్నారు. ఎన్ని ప్రభుత్వోద్యోగాలున్నాయి? ఎంతమందికి ఇవ్వగలరు? ప్రభుత్వోద్యోగానికి – సాధారణ ప్రజల ఉపాధికి మధ్య అంతరాన్ని ఎంతకాలం అలా కొనసాగిస్తూ దేశాన్ని నాశనం చేస్తారు?

**ఆర్థికంగా ఎదుగుదలకు, రిజర్వేషన్లకు కచ్చితంగా సంబంధం ఉంది**

రిజర్వేషన్లు మౌలికంగా కుల వివక్షకు సంబంధించినవని,

వాటిని ఆర్థికంగా వెనుకబడిన పేరుతో రిజర్వేషన్లకు బయట ఉన్న కులాలకు వర్తింప చేయకూడదని కొందరంటున్నారు. అలాగే రిజర్వేషన్ కులంలో ఆ కోటా ద్వారా లబ్ధి పొంది కలెక్టర్ అయినా కూడా, ఆ తర్వాత కూడా ఆ సౌకర్యాన్ని కొనసాగించాల్సిందేనని, కలెక్టర్ కొడుకైనా, మంత్రి కూతురైనా రిజర్వేషన్‌ను వర్తింపచేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. అదేమంటే, వివక్ష అంటున్నారు. ఈ వాదనల్లోని లోపాన్ని కూడా ఇక్కడ చర్చలోకి తేవాలి. ఆర్థికంగా ఎదుగుదల, సమాజంలో హోదా ద్వారా కాకుండా వివక్ష ఎలా పోతుంది మరి? అవి రెండూ కాకుండా రిజర్వేషన్ల ద్వారా వచ్చే లాభాలేంటి? వాటి కోసం కాకుండా రిజర్వేషన్లను మరి ఎందుకు ఏర్పాటు చేసినట్లు?.. కాబట్టి ఆర్థిక ఎదుగుదలకు, రిజర్వేషన్లకు కచ్చితంగా సంబంధం ఉంది. అందువల్ల, రిజర్వేషన్ కులాల్లోపల రిజర్వేషన్‌ను ఒకసారి పొంది ఒక స్థాయికి వెళ్లినవారికి తర్వాతి తరంలో రిజర్వేషన్ లేకుండా చేయాలి. అలాగే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక తోడ్పాటును అందించాలి. ఈ విషయంలో మోదీ చేసిన ప్రయత్నాన్ని తప్పు పట్టనక్కర్లేదు. కానీ చేసిన తీరును, తద్వారా చిత్తశుద్ధిని ప్రశ్నించి తీరాలి.

**చివరకు రాజ్యాంగానికి, ప్రతిభకు రిజర్వేషన్ కల్పిస్తారా?**

అదనపు మార్కుల్ని కలపటం వంటి మార్గాల్లో కాకుండా, కోటా రూపంలో ఇవ్వటం వల్ల రిజర్వేషన్లే శాశ్వత పరిష్కారమనే తప్పుడు సంకేతం వెళ్లింది. చివరికి ప్రతి ఒక్కరూ రిజర్వేషన్ పరిధిలోకి వెళ్తే, 'సమానత్వానికి బదులు పరిహారం సాధారణ పాలనగా మారి, రాజ్యాంగానికి, ప్రతిభకు రిజర్వేషన్ కల్పించటం' అనే మతిమాలిన పరిస్థితి ఏర్పడుతుంది. విద్యను బాగు చేసి అందరిలోని ప్రతిభను వికసించే ప్రయత్నం చేయకుండా, కేవలం పుట్టుకను బట్టి అవకాశాలను అందించాలనుకునే పాలన ముమ్మందు జాతిని దిగజారుస్తుంది తప్ప పటిష్టం చేయదు. 'ఎనిమిది లక్షల ఆదాయగాళ్లు – అందరికీ రిజర్వేషన్లు – అయినా ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి' అనే సమాజాన్ని తయారుచేస్తుంది. తన ఎన్నికల హామీల్ని నెరవేర్చలేని పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు తీసుకునే ఆపద్ధర్మ చర్యని కూడా మోదీ ప్రభుత్వం సక్రమంగా తీసుకోకపోవటం దురదృష్టకరం.

**లోక్‌సత్తా పరిష్కారాల్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ కూడా సమర్థించారు**

ఇప్పుడున్న రిజర్వేషన్లను కొనసాగిస్తూనే, కలెక్టర్లు, ఎంపీలు, మంత్రులు వంటి వారికి రిజర్వేషన్లను తొలగించి ఆయా కులాల్లోనే దిగువస్థాయిలో ఉన్నవారికి అందించాలని, పేద పిల్లలకు ఎంపిక పోటీ పరీక్షల్లో అదనంగా మార్కులు కలపాలని (ఈ మార్కుల వెయిటేజీకి ఆ పిల్లలు చదివే స్కూలు స్థాయి, తల్లిదండ్రుల ఆర్థిక, విద్యాస్థాయి వంటివి పరిగణలోకి తీసుకోవచ్చు), కులం, మతం, డబ్బుతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని.. రిజర్వేషన్ల చిచ్చుకు లోక్‌సత్తా నిర్దిష్ట పరిష్కారాల్ని కొన్నేళ్లుగా సూచిస్తూ వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో కాపు, ముస్లిం రిజర్వేషన్ల వివాదంపై కూడా ఈ సూచనల్ని చేసింది. దేశంలోనే తొలిసారిగా రిజర్వేషన్లపై లోక్‌సత్తా చూపిన ఈ సమగ్ర పరిష్కారాల్ని బీహార్ తాజా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్.ఎస్.ఎస్ చీఫ్ కూడా పరోక్షంగా సమర్థిస్తూ ఒక ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. ఆ సమయంలో ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకమనే విమర్శలు చెలరేగినప్పుడు, ఇప్పుడు ఈబీసీ రిజర్వేషన్‌కు రాజ్యాంగ సవరణ విషయంలో నిలబడినట్లు గనక మోదీ నిలబడి నిర్దిష్ట సంస్కరణలను చర్చకు పెట్టినట్లయితే చాలామంది ఆయనకు మద్దతుగా నిలబడి ఉండేవారు. తన ఎన్నికల హామీని కూడా నిలబెట్టుకున్నట్లయి ఉండేది. ఆ పని చేయకుండా.. మహారాష్ట్ర, తెలంగాణ, హర్యానా తదితర రాష్ట్రాలు కోటాల పేరుతో రిజర్వేషన్ల శాతాన్ని పెంచుకుంటూ పోతుంటే బెల్లం కొట్టిన రాయిలా చూస్తుండిపోయారు. ఎన్నికలకు కొన్ని వారాల వ్యవధి ఉందనగా మేలుకొని, రెండ్రోజుల్లో రాజ్యాంగ సవరణతో మాట్లు వేసే రీతిలో పేలవమైన కోటాను తీసుకొచ్చారు.

సమాజంలో పేద యువతకు మేలు చేయాలన్న మోదీ ప్రభుత్వ ప్రయత్నాన్ని ఆహ్వానించాల్సిందేగానీ, పరిష్కారమైతే ఇది కాదు. కానీ రిజర్వేషన్ల మీద చర్చ మొదలవటం.. హేతుబద్ధ సంస్కరణల్ని సాధించుకోవటానికి ఒక సదవకాశం! దీన్ని ఉపయోగించుకుని వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలున్న సమాజాన్ని నిర్మించుకోవటం ఇప్పుడు మన ముందున్న తక్షణ కర్తవ్యం.

# రిజర్వేషన్లలో మాట్లు కాదు.. సంస్కరణలు కావాలి: జేపీ

**రిజర్వేషన్లపై ప్రామాణిక పరిష్కారాలతో దేశంలోనే ఒక సమగ్రమైన విధానాన్ని ప్రకటించిన తొలి రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్‌లకు పార్లమెంటు రాజ్యాంగ సవరణను ఆమోదించిన సందర్భంగా.. రిజర్వేషన్లపై, గుజ్జర్లు, మరాఠాలు, పాటీదార్లు, ముస్లింలు, కాపులు తదితరుల కోటా డిమాండ్లపై, లోక్‌సత్తా సమగ్ర పరిష్కారాలపై ప్రజల నుంచి వచ్చిన కొన్ని కీలక ప్రశ్నలకు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ జవాబులివి:**

**(?) ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లను కల్పించటంపై మీ అభిప్రాయం**

జేపీ: అన్ని వర్గాల్లో ఉన్న పేదలకు న్యాయం చేయాలన్న జాతీయ స్థాయి ప్రభుత్వ సంకల్పం మంచిదే. కానీ అందుకోసం అనుసరించిన పద్ధతి.. తాత్కాలికంగా మాట్లు వేస్తున్నట్లుంది. కోటా పెంపునకు రాజ్యాంగపరంగా, సుప్రీంకోర్టు తీర్పు పరంగా కూడా ఇబ్బందులున్నాయి. రాజ్యాంగానికి మౌలికం అనదగ్గ సమానత్వ భావాన్ని అనుసరించే సుప్రీంకోర్టు 50 శాతం పరిమితిని విధించింది. ప్రస్తుతం కోటా కోసం పార్లమెంటు సవరణలు చేసిన 15, 16 అధికరణాలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని కోర్టు తీర్పులున్నాయి.

మరోవైపు, మన దేశ జనాభాలో 90 శాతం దాకా అసంఘటిత రంగంలో ఉండగా, కేవలం 5 శాతం లోపు మాత్రమే ప్రభుత్వోద్యోగాల్లో ఉన్నారు. కానీ ప్రభుత్వోద్యోగులకు మార్కెట్‌లో ప్రైవేటు ఉద్యోగులకు చెల్లించే వేతనాల కన్నా 2-4 రెట్లు ఎక్కువగా ఇస్తున్నారు. పౌర సేవల చట్టం, సమాజంలోని నిష్ణాతుల సేవలను వినియోగించుకోవటం వంటి ఏర్పాట్లతో ప్రభుత్వోద్యోగ రంగాన్ని సంస్కరించి ప్రజలకు మెరుగైన సేవలందించేలా చేయకుండా, చిన్న పని, పెద్ద పని అనే తేడా లేకుండా సమాజానికి ఉపయోగపడే పని ద్వారా ఉపాధి పొందే




సంస్కృతిని జనజీవనంలో పెంచే ప్రయత్నం చేయకుండా.. ఉద్యోగాలంటే ప్రభుత్వోద్యోగాలే అన్న భ్రమను ప్రభుత్వమే కల్పించే ప్రయత్నం చేయటం విచారకరం. వచ్చే ఎన్నికల్లో ఇంకొన్ని పార్టీలు ఇంకొన్ని రిజర్వేషన్లకు హామీలిచ్చే అవకాశముందంటున్నారు. భవిష్యత్తులో ఏమవుతుందో చూద్దాం. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక ఆరోగ్యకరమైన చర్చకు దారితీస్తుందని, పరిష్కారం సాధ్యమవుతుందని ఆశిద్దాం.

**(?) రిజర్వేషన్ల విధానంలో లోక్‌సత్తా ప్రతిపాదించిన సంస్కరణలేమిటి**

1) ఐఏఎస్, ఐపీఎస్, ఇతర కేంద్ర, రాష్ట్ర సివిల్ సర్వీసులు తదితర స్థాయి ప్రభుత్వరంగ ఉద్యోగుల్ని, ప్రస్తుత లేదా మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర సీనియర్ రాజకీయ నేతలు, మంచి ఆదాయం వచ్చే వైద్యులు, ఛార్టర్డ్ అకౌంటెంట్లు, ప్రైవేటు రంగంలో ఒక స్థాయి పైబడిన మేనేజర్లు, కొంత

ఆదాయం దాటిన వ్యాపారవేత్తలు మొదలైనవారిని రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించాలి (డిస్ రిజర్వ్ చేయాలి). అంటే, తమ సొంత కులాల్లో అవకాశాలు అందని నిజమైన ఆర్తుల పిల్లలకు అవకాశాలు అందించేందుకు పైస్థాయిలోని వారు రిజర్వేషన్ల నుంచి వైదొలగాలి. దీనివల్ల, అణగారిన కులాల్లోని పేదలకు ఎదిగేందుకు నిజమైన అవకాశం లభిస్తుంది.

2) ఓసీ కులాల్లోని పేద పిల్లలు తమ లోటును అధిగమించగలిగేలా మార్కుల్లో సహేతుకంగా కొన్ని అదనపు మార్కుల్ని (5 నుంచి 10శాతం) కలిపే ఏర్పాటు చేయాలి. ఈ వెయిటేజీ మార్కుల్ని నిపుణుల బృందం నిర్ణయిస్తుంది. అధికారులిచ్చే ఆదాయ సర్టిఫికెట్ల మీద ఆధారపడితే ఏ ప్రయోజనమూ ఉండదు. కోట్లకి పడగలెత్తే కుటుంబాలకి కూడా తెల్లరేషన్ కార్డులు, కాలేజీలలో ఫీజు మినహాయింపులు అమలవుతున్న సమాజంలో దొంగ సర్టిఫికెట్లు సృష్టించటం చాలా తేలిక. కాబట్టి అర్హులైన కుటుంబాలను గుర్తించటానికి పరిశీలనకు అవకాశమున్న, విశ్వసనీయమైన, న్యాయమైన ధృవీకరణ ఏర్పాటు చేసుకోవాలి. తల్లిదండ్రుల చదువుని, పిల్లలు చదివే స్కూలుని ఇందుకు ప్రాతిపదికలుగా తీసుకోవచ్చు. ఇతర ప్రాతిపదికల్ని స్థూల ఏకాభిప్రాయంతో రూపొందించుకోవచ్చు. ఒక్కసారి ఓసీల్లోని పేద పిల్లలు అదనపు మార్కుల్ని (5 నుంచి 10శాతం) పొందితే, వారు తమ కులాల్లోని సంపన్నుల బిడ్డలతో సమానస్థాయిలో పోటీపడగలుగుతారు.

అలాగే, ప్రతిభ ఉండి, ఉన్నత విద్య చదవాలనుకున్న ఏ బిడ్డకూ పేదరికం, పుట్టిన కులం అవరోధం కాకూడదు. స్కాలర్ షిప్పులు, ఉచిత ట్యూషన్, తేలికైన రుణాలు, ఇతర ఏర్పాట్లు అన్నిటినీ సమగ్రమైనరీతిలో పటిష్టపరచాలి.

3) ఇదేసమయంలో పాఠశాల విద్యలో ఫలితాలను మెరుగుపరిచేందుకు జాతీయస్థాయిలో ఒక విప్లవంలా కృషి జరగాలి. పుట్టుకతో, పేదరికంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన స్కూలు చదువు గ్యారంటీగా అందేలా మనం వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలి. పాఠశాల విద్యాప్రమాణాలపై ప్రోగ్రాం ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్‌మెంట్ (పీసా) నిర్వహించిన సర్వేలో భారత్ 73వ స్థానంలో ఉండటం, విద్యారంగ స్థితిగతుల వార్షిక నివేదిక (అసర్) వరస ఫలితాలు మన పాఠశాల విద్య అధ్వాన్నస్థితికి నిలువెత్తు నిదర్శనాలు. నాణ్యమైన విద్య, సంపద సృష్టికి పనికొచ్చే నైపుణ్యాలు మాత్రమే ఎదిగేందుకు మనకు ఏకైక మార్గాలు.

**(?) అసలు రిజర్వేషన్లు ఉండాలంటారా**

ఉండాలి. రిజర్వేషన్లు ఇప్పటికీ అవసరం. విస్తృత స్థాయి పేదరికం, కుల అణచివేత, శతాబ్దాల తరబడి వివక్ష, కేవలం పుట్టుకను బట్టే అత్యధిక సంఖ్యాక పిల్లల భవిష్యత్తు నిర్ణయమైపోవటం వంటి పరిస్థితులు వ్యవస్థీకృతంగా ఉన్న భారత్ వంటి దేశంలో, అణగారిన కులాల్లోని వారికి అదనపు అవకాశాల్ని కల్పించేందుకు ప్రత్యేక ప్రయత్నాలు తప్పనిసరిగా అవసరం. ఎదిగే అవకాశాలు అందని కులాల్లోని వారికి ఎదిగే ఆసరా ఇచ్చేందుకు రిజర్వేషన్లు అవసరమన్నదే మనదేశంలో స్థూలంగా వ్యక్తమయ్యే ఏకాభిప్రాయం.

**(?) దేశానికి స్వతంత్రం వచ్చి 70 ఏళ్లు గడిచాక కూడా రిజర్వేషన్లు కొనసాగాలా**

నిస్సందేహంగా కొనసాగాలి. ఎందుకంటే, పుట్టుక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ కనీసం పదిపన్నెండేళ్లపాటు నాణ్యమైన చదువును గ్యారంటీగా అందించాల్సిన ప్రాథమిక బాధ్యతల్ని నెరవేర్చటంలో మన ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. ప్రపంచంలోని నాగరిక దేశాల్ని చూస్తే, తల్లిదండ్రుల మీద రూపాయి భారం లేకుండా ఏ కుటుంబంలో పుట్టినా ప్రతి బిడ్డకూ పనికొచ్చే మంచి చదువును అందించేందుకు వ్యవస్థీకృత ప్రయత్నాలు చేసి గొప్ప ప్రగతిని సాధించటం చాలా చోట్ల కనిపిస్తుంది.

పెద్ద ఆర్థికవ్యవస్థలున్న దేశాల్లోనైతే భారతదేశం మినహా అన్ని దేశాలూ విద్య చుట్టూ రాజకీయాన్ని, సమాజాన్ని నడిపించి అభివృద్ధిని సాధించాయి. మనం మాత్రమే పనికిమాలిన విద్యావ్యవస్థను తయారుచేసుకున్నాం. నాణ్యమైన పాఠశాల విద్య కొద్దిమంది సంపన్న, ఉన్నత మధ్యతరగతి వారికే పరిమితం కావటం వల్ల, వచ్చే పరిమిత ఫలితాలు కూడా వారికే పరిమితమయ్యాయి. చాలా ప్రభుత్వ స్కూళ్లు ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోగా, చాలా ప్రయివేటు పాఠశాలు నాసిరకమైన చదువునందిస్తూ, నామమాత్రపు ప్రమాణాలతో నడుస్తున్నాయి. పాఠశాల విద్యాప్రమాణాలు, ఫలితాలు అత్యంత అధ్వాన్నంగా మారాయి.

పదిహేనేళ్ల పిల్లల్లో విద్యాప్రమాణాలపై 74 దేశాల మధ్య 2009లో జరిపిన 'పీసా' సర్వేలో భారతదేశం 73వ స్థానంలో ఉంది. ఇది చూశాకైనా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకి

యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించాల్సింది పోయి, ఇక మీదట ఆ సర్వేలో పాల్గొనబోమంటూ భారత ప్రభుత్వం నిస్సిగ్గుగా పలాయనం చిత్తగించింది.

గ్రామీణ భారతంలో ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో విద్యాప్రమాణాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో 'అసర్' ఏటా బైటపెడుతూనే ఉంది. తాజా సర్వే (2018)లో ప్రమాణాలు ఇంకా దిగజారినట్లు వెల్లడైంది. నిజమైన నాణ్యతతో కూడిన పాఠశాల విద్యావ్యవస్థను ప్రభుత్వం అందించకపోవటం వల్ల పేదలు తాము చేయని తప్పుకి అవకాశాల్ని కోల్పోతున్నారు. పుట్టుకతో అవకాశాల లేమి మన మెజారిటీ పిల్లలకు శాపంగా మారింది. కాబట్టి, పోటీలో సమానస్థాయి కోసం రిజర్వేషన్లు కొనసాగవలసిందే.

**(?) రిజర్వేషన్లకు కులం ప్రాథమిక ప్రాతిపదిక కావాలా**

ఖచ్చితంగా కావాలి. రిజర్వేషన్లకు కులం ప్రాథమిక ప్రాతిపదికగా ఉండటం అవసరం. కులం, చదువు, ఎదిగే అవకాశాలు, పేదరికం మధ్య స్పష్టమైన సంబంధం ఉందని అనేక సామాజిక-ఆర్థిక సర్వేలు తేటతెల్లం చేశాయి.

భారత్‌లోని పేదలు, అణగారిన వర్గాలలో అత్యధికులు దళితులు, ఎస్.టిలు లేదా వెనకబడిన తరగతులకు చెందినవారుకాగా, అన్ని కులాలు, వర్గాల ప్రజానీకంలో కూడా పేదలున్నారనేది కూడా వాస్తవం. ఎన్ని ఘనతలున్నా భారత్ పేద దేశమని, అత్యధికులు తక్కువ ఆదాయం, తక్కువ అక్షర జ్ఞానం, తక్కువ తలసరి ఆదాయం కలిగి పౌష్టికాహారలోపం, అనారోగ్యాలతో బతుకుబండిని లాగుతుంటారనే కఠోర వాస్తవాన్ని ఈ మొత్తం చర్చలో మనం విస్మరించకూడదు. అయితే ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీల్లో పేదలు, అవకాశాలు అందనివారు చాలా ఎక్కువమంది ఉండగా, ఇతర కమ్యూనిటీల్లో (ఓసీల్లో) పేదలు, అవకాశాలు అందనివారు కొంతమంది ఉన్నారు. కాబట్టి వివక్షను అధిగమించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన రిజర్వేషన్ వంటి విధానాలకి కులం ప్రాథమిక ప్రాతిపదికగా కొనసాగాల్సిందే.

అయితే, వివక్షకు విరుగుడు విధానాలకు కులం మాత్రమే పూర్తి ప్రాతిపదిక కాదు. అణగారిన కులాల్లో ఎదిగే అవకాశాలు అందని అత్యధిక సంఖ్యాక బిడ్డలకు రిజర్వేషన్ల ప్రయోజనాలు అందాలి తప్ప, అణగారిన కులాల పేర్లు తగిలించుకున్న సంపన్నులు, చదువుతో స్థిరపడిన వారి పిల్లలకు కాదు.

**(?) రిజర్వేషన్లు ఆశించిన ఫలితాల్ని నిజంగా సాధించాయా, రిజర్వేషన్ కులాల్లో పైస్థాయి వారికి మాత్రమే రిజర్వేషన్లు లబ్ధి చేకూర్చాయని మీరు చేస్తున్న వాదనకు ఆధారమేమిటి**

ఏ రకంగా చూసినా ఫలితాలు ఆశించిన మేర లేవు. ఇంతకుముందే వివరించిన రెండు కారణాల వల్ల రిజర్వేషన్ల ఫలితాలు పరిమితంగానే ఉన్నాయి. మన ఆరోగ్య వ్యవస్థలాగే మన పాఠశాల విద్యావ్యవస్థ కూడా అత్యంత అధ్వాన్నమైనది. తల్లిదండ్రులకు పెద్దగా చదువులేని పేదకుటుంబాల నుంచి వచ్చిన బిడ్డలకు మనదేశంలో స్కూలు స్థాయిలో ఏరకమైన తోడ్పాటూ ఉండదు. అసలు స్కూలు చదువే లోపభూయిష్టంగా ఉన్నప్పుడు, పేదపిల్లలకు నాణ్యమైన బడి చదువు అందదు. దాంతో, రిజర్వేషన్ల ప్రయోజనాలు అత్యధికులకు అందకుండా పోయాయి.

నైపుణ్యాల్ని పెంచుకోవటంలో, సంపదను సృష్టించటంలో పేదలకు అవకాశం లభించటం లేదు. ఫలితంగా, పేదరికం నిరంతరం కొనసాగుతూ, వెనకబాటుతనం వ్యవస్థీకృతంగా పాతుకుపోతోంది.

ఒక స్థాయి దాటాక రిజర్వేషన్లు ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీల్లోని మెజారిటీ పేదలకు దక్కకుండా, సంపన్న, ఎక్కువ చదువుకున్న తల్లిదండ్రులున్నవారికే దక్కటం మొదలవుతుంది. ఈ ఒరవడి గత 25-30 ఏళ్లుగా కనిపిస్తుంది. స్వతంత్రం వచ్చాక నాలుగు దశాబ్దాలపాటు రిజర్వేషన్లతో విద్య, ఉద్యోగాలలో అవకాశాలు పొందినవారు తమ కులాల్లోని నిజమైన పేదలు, అవకాశాలు అందనివారికే అవకాశాలు దక్కకుండా చేస్తున్నారు. అత్యుత్తమ సంస్థల్లో ఉన్నత విద్య కావచ్చు, ఉన్నతోద్యోగాలలో రిక్రూట్‌మెంట్ కావచ్చు - వీటిల్లో ఐఏఎస్, ఐపీఎస్, ఇతర సీనియర్ అధికారుల పిల్లలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ఉన్నతస్థాయి రాజకీయ నేతల వారసులు, వివిధ వృత్తుల్లో రాణించిన నిపుణులు, వ్యాపారవేత్తల సంతానం మాత్రమే రిజర్వేషన్లకు అర్హమైన కులాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నారు.

ఇప్పుడున్న రిజర్వేషన్ విధానం వల్ల రిజర్వేషన్లు ఎక్కువగా సంపన్న, చదువుకున్న కొద్దిమందికే ఎలా దక్కుతున్నాయో, అణగారిన కులాల్లోని అత్యధిక సంఖ్యాక నిజమైన పేద కుటుంబాలు ఇంకా అవకాశాలు అందని స్థితిలోనే ఎలా మగ్గిపోతున్నాయో మరింత సోదాహరణంగా చెప్పేందుకు పేరొందిన సంస్థల నుంచి తగిన ఆధారాలతో సమాచారాన్ని సేకరిస్తున్నాం.

**(?) రిజర్వేషన్లు వివక్షను నిర్మూలిస్తాయా**

ఖచ్చితంగా నిర్మూలించ లేవు. ఒకసారి ఒక వ్యక్తికి ఉన్నత విద్య పొందే అవకాశం, ప్రభుత్వోద్యోగాల ద్వారా ఆర్థిక భద్రత ఉంటే, సమాజంలోని వివక్షను ఎదుర్కొని నిలదొక్కుకోగల సహేతుక సామర్థ్యం అతనికి/ఆమెకి సమకూరుతుందన్నదే రిజర్వేషన్ల వెనక ఉన్న తర్కం. ఈ అవకాశాల్ని కల్పించగలిగే శక్తి మాత్రమే ప్రభుత్వానికి ఉంటుంది. ఇంతకుమించి, కుల వివక్షను సమూలంగా నిర్మూలించాలంటే అది ప్రజాస్వామ్య, సామాజిక, మత సంస్కరణల ద్వారానే సాధ్యమవుతుంది.

మనం రోజువారీ జీవితంలో కులాన్ని ఎదుర్కోవాలంటే, ఒక భారీ సామాజిక, మత ఉద్యమం మొదలవ్వాలి. కులతత్వం నరనరాల్లోకీ ఇంకిపోయి డీఎన్ఏగా తయారవటంతోపాటు రాజకీయ పార్టీలు కుల రాజకీయాలు చేస్తూ ప్రజల్ని చీలుస్తుండటం వల్ల పట్టణీకరణ వేగంగా జరుగుతున్నాకూడా ఆ స్థాయిలో కుల ప్రభావం తగ్గటం లేదు. నిజానికి, రిజర్వేషన్లు అమలవుతున్న తీరు కూడా కులాల మధ్య చిచ్చుపెడుతూ సమస్యగా తయారైంది.

సుదీర్ఘకాలంగా అవకాశాలు అందక మగ్గిపోతున్న కులాల ప్రజలు తమ జీవితాలు పెద్దగా మారింది లేదు, తమ బిడ్డలు కూడా విద్యావకాశాలు అందకుండా బాధితులుగానే మిగిలిపోతారని ఆక్రోశిస్తున్నారంటే వారిని తప్పుపట్టలేం. అదేసమయంలో అగ్రకులాలుగా మనం పిలుచుకుంటున్నవారు, తమ బిడ్డలకు దక్కాల్సిన అవకాశాల్ని రిజర్వేషన్ల పరిధిలోని కులాలవారే తన్నుకుపోతున్నారనే ఆక్రోశంతో అసూయా ద్వేషాల్ని, అపోహల్ని రోజురోజుకూ పెంచుకుంటున్నారు.

దేశంలోని పేదరికం, అధ్వాన్న పాఠశాల విద్య, అత్తెసరు ఆర్థిక, ఉద్యోగ వృద్ధి, కుల రాజకీయాలు ఇలా అన్నీ కలిసి కులాల మధ్య అగాధాల్ని తయారు చేసి పెంచుతున్నాయి.

వివక్షను నిర్మూలించటానికి స్కూలు విద్య నాణ్యతా ప్రమాణాల్ని పెంచటం, రిజర్వేషన్లు వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయటం, చట్టబద్ధపాలన అందించటం ప్రభుత్వం చేయగలిగిన, చేయాల్సిన పనులు. అదేసమయంలో, రాజకీయ పార్టీలు చిచ్చు పెట్టే జీరో-సమ్ గేమ్ రాజకీయాలను వదిలిపెట్టి తీరాలి, సమాజం కులాంతర వివాహాలను జీవనసంస్కృతిలో భాగంగా అంగీకరించి ప్రోత్సహించాలి, మత నాయకులు కులాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూ ఐక్యతను సామరస్యతను పెంపొందించటాన్ని ఓ నిరంతర కార్యక్రమంగా నిర్వర్తించాలి.

**(?) ఓసీలలో పేదల్ని మనం రిజర్వేషన్ కోటాలలో ఎందుకు చేర్చకూడదు**

ఇది వాంఛనీయం కాదు. సుప్రీంకోర్టు ఇప్పటికే రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని విధించింది. 50శాతం సహేతుకమని నిష్పాక్షిక పరిశీలకులు కూడా భావిస్తున్నారు. చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ పాలనలో ఉన్న ఓ విశ్వసనీయ సమాజంగా మనం రిజర్వేషన్ల పరిధిని పరిమితి దాటి పెంచలేం. అయితే ఓసీ కమ్యూనిటీలో అవకాశాలు అందక, ఓసీ కులాల్లోని సంపన్న పిల్లలతో పోటీ పడలేక అణగిపోతున్న బిడ్డలకు అదనపు అవకాశాలతో తోడ్పాటునివ్వటానికి మనం ఒక నూతన సంస్థాపరమైన ఏర్పాటును అందించవచ్చు.

ఓసీ కమ్యూనిటీల్లోని పిల్లల నేపథ్యాన్ని వాస్తవికంగా గుర్తించి, వారికి అదనపు మార్కుల్ని కలపటం అటువంటి ఒక వ్యవస్థీకృత ఏర్పాటు. ఉదాహరణకి, ఓ ప్రభుత్వ స్కూలులోనో, నామమాత్రపు ప్రైవేటు పాఠశాలలోనో చదువుతూ 10 లేదా 12వ తరగతిలో 80శాతం మార్కులు సాధించిన పేద, చదువు లేని గ్రామీణ కుటుంబానికి చెందిన బిడ్డ విషయాన్నే తీసుకుందాం. ఏటా రూ.20,000కు పైగా ఫీజు చెల్లిస్తూ పేరున్న స్కూలులో చదువుతూ అధికాదాయ కుటుంబం నుంచి వచ్చిన బిడ్డ 85-90 శాతం మార్కుల్ని సాధించినా కూడా, అతను/ఆమె కన్నా పేద, అక్షరజ్ఞానం లేని కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన 80శాతం మార్కుల్ని సాధించిన బిడ్డే మరింత సామర్థ్యం, అర్హత కలిగినదని న్యాయంగా ఆలోచించే ఏ సమాజమైనా అంగీకరిస్తుంది. దురదృష్టవశాత్తూ, మనం మెరిట్‌గా చెప్పుకుంటున్న ప్రస్తుత వ్యవస్థ ఈ తేడాని గుర్తించటం లేదు. పేద పిల్లలు ఎంతో కష్టపడి 80శాతం మార్కులు తెచ్చుకున్నా, వీరికంటే పేరొందిన స్కూలులో చదువుకుని 90శాతం మార్కులు తెచ్చుకున్న ఓసీ కులాల్లో సంపన్నులైన కుటుంబాల బిడ్డలే ఎక్కువ ప్రతిభావంతులుగా చెలామణి అవుతూ అవకాశాల్ని అందుకుంటున్నారు. నేపథ్యం చూడకుండా కేవలం మార్కుల ఆధారంగానే పిల్లలకు ఎదిగే అవకాశాల్ని కల్పించే యాంత్రిక, అసంబద్ధ పద్ధతుల్ని మనం అవలంబిస్తూ ఓసీల్లోని పేదలకు అన్యాయం చేస్తున్నాం. కాబట్టి, ఈ కులాల్లోని నిజమైన పేదలకు మార్కుల రూపంలో వెయిటేజీ ఇవ్వటం న్యాయం, సహేతుకం. దీనివల్ల మూడు ప్రత్యేక ప్రయోజనాలు సమకూరతాయి:

1. నిష్పాక్షికత, పారదర్శక సమాచారం ప్రాతిపదికలుగా

ఓసీలలో నిజంగా అవకాశాలు అందని పిల్లలకు మాత్రమే వెయిటేజీ మార్కులు అందుతాయి.

2. దీనివల్ల రిజర్వేషన్‌లేని ఓసీలలో పేదలకకోసం అదనపు కోటాలను సృష్టించాల్సిన అవసరముండదు.

3. ఈ కులాల్లో అవకాశాలు అందని పిల్లలు సైతం కొన్ని ప్రమాణాల మేర కష్టపడి సామర్థ్యాన్ని ప్రదర్శించక తప్పదు. మార్కులు వస్తే అదనంగా కలుపుతారు తప్ప ఏమీ చదవకపోయినా, సామర్థ్యాన్ని ప్రదర్శించకపోయినా గ్యారంటీ కోటా వీరికి ఉండదు.

**(?) రిజర్వేషన్ల పరిధిలో లేని కులాల్లో (ఓసీల్లో) ఈ వెయిటేజీకి అర్హులెవరో, అనర్హులెవరో మీరు ఎలా నిర్ణయిస్తారు**

స్కూలు చదువు నాణ్యత, అవకాశాలు అందకపోవటం – ఈ రెంటినీ నిర్ణయించేది నిస్సందేహంగా పేదరికమే. అయితే, మనదేశంలోని చాలా రాష్ట్రాలలో ఈ వర్గం, ఆ వర్గం అని తేడా లేకుండా 90శాతానికి పైగా ప్రజలు భారీగా సబ్సిడీ బియ్యం, గోధుమలను తీసుకునేందుకు రేషన్ కార్డుల్ని సృష్టించుకోగలుగుతున్నారు. పేదలకు మాత్రమే ఉద్దేశించిన ఫీజు రీఇంబర్స్‌మెంట్ లేదా ఇతరత్రా రాయితీని పొందేందుకు కావలసిన ఆదాయపు ధృవపత్రాన్ని ఎవరైనా తేలిగ్గా సంపాదించగలుగుతున్నారు.

కాబట్టి, ఆదాయం స్పష్టమైన గీటురాయే అయినప్పటికీ, అమలులోకి వచ్చేసరికి చాలా సందర్భాలలో ఆదాయపు సర్టిఫికెట్ల ప్రాతిపదిక ఫలితాలనివ్వదు.

అందుకే, అంత తేలిగ్గా మోసపుచ్చటానికి వీల్లేకుండా నిర్దిష్టమైన, పరిశీలనకు అవకాశమున్న, సహేతుకమైన, న్యాయమైన ప్రాతిపదికని మనం ఏర్పాటుచేసుకోవాలి. ఈలోగా రెండు ప్రాతిపదికల్ని మేం సూచిస్తున్నాం:

1. తల్లిదండ్రుల చదువు, ఉపాధి
2. పిల్లలు వెళ్తున్న స్కూలు

తల్లిదండ్రులకు చదువులేకపోవటమో లేదా నామమాత్రపు బడి చదువో ఉంటే చాలా సందర్భాలలో పిల్లలు పేదరికం, అవకాశాలు అందకపోవటం, నాసిరకం చదువు బారిన పడతారని మనం తేలిగ్గా గుర్తించవచ్చు. పిల్లలు గనక సాధారణ ప్రభుత్వ స్కూలులో (కేంద్రీయ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, అటువంటి పేరున్న పాఠశాలల్లో కాకుండా) లేదా ఏటా రూ.6,000 లేదా ఇంకా తక్కువ ఫీజు చెల్లిస్తూ నామమాత్రంగా నడిచే ప్రయివేటు స్కూలులో చదువుతుంటే, ఆ బిడ్డలు పేదరికంలో, అవకాశాలు అందని స్థితిలో ఉన్నారని మనం నిర్ధారించవచ్చు. అయితే ఈ ప్రాతిపదికలు శిలాశాసనాలు కావు. ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుని మారుతున్న పరిస్థితులకనుగుణంగా సరిచేసుకుంటుండాలి. న్యాయంగా, నిష్పాక్షికంగా ఉండే ఇతర గీటురాళ్లను కూడా గుర్తించే ప్రయత్నాలు జరగాలి.

తల్లిదండ్రుల్లో ఇంటికి ప్రధాన ఆదాయవనరుగా ఉన్న వారికి చదువు లేకపోయినా, కొద్దిపాటి అక్షరజ్ఞానమే ఉన్నా, పిల్లలు ప్రభుత్వ పాఠశాలకో లేదా నామమాత్రపు ప్రయివేటు పాఠశాలకో వెళ్తుంటే, ఆ బిడ్డల కుటుంబం ఆర్థికంగా వెనకబడిందని మనం ధృవీకరించవచ్చు.

**(?) ఇలా రిజర్వేషన్లను హేతుబద్ధీకరిస్తే పేదల జీవితాలు బాగుపడతాయా**

లేదు. ఇవి అవసరమైన చర్యలే తప్ప ఇవే సరిపోవు. జేబులో నుంచి రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన చదువును అందించినప్పుడే మనం పేదరికాన్ని, వివక్షను అంతం చేసి ఎదిగే అవకాశాల్ని అందించగలం. పుట్టుక నేపథ్యం బిడ్డ ఎదిగే అవకాశాలకు అవరోధం కాకుండా చేయగల నిజమైన శక్తి, గ్యారంటీ మంచి స్కూలు విద్య మాత్రమే. పేదరికం నుంచి ప్రజలు బైటపడటానికి ఉద్యోగాల్ని సృష్టించే, ఆదాయాన్ని పెంచే పటిష్టమైన ఆర్థికవ్యవస్థను మనం నిర్మించుకోవాలి. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం 368 ప్యూను ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీచేస్తే 23 లక్షలమంది యువత దరఖాస్తు చేశారని వార్తలు చెబుతున్నాయి. వారిలో లక్షలాదిమంది యూనివర్సిటీ గ్రాడ్యుయేట్లు కాగా, వందల మంది పీహెచ్‌డీలు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూడా 30 బంట్రోతు ఉద్యోగాలకు 75,000 మంది దరఖాస్తు చేశారు. మనదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఈ రోజుల్లో కూడా ప్రభుత్వం ప్యూను ఉద్యోగాలను భర్తీ చేయటం, బాగా చదువుకున్న అనేకమంది యువత కూడా అలాంటి చిన్నచిన్న ఉద్యోగాల కోసం కలబడటం చూస్తే మనం ఎదుర్కొంటున్న సవాలు ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది. రైల్వేలో తొంభై వేల ఉద్యోగాలకు 2 కోట్ల 80 లక్షల మంది దరఖాస్తు చేశారు. బహుశా ప్రపంచ చరిత్రలోనే ఇదో పెద్ద రికార్డు. చాలా దేశాల జనాభా కూడా 2 కోట్లు ఉండదు.

ఎంత ఎక్కువ చదువుకుంటే, అంత తక్కువ నిరుద్యోగం

అనేది ప్రపంచవ్యాప్తంగా కనిపించే ధోరణి కాగా, భారతదేశంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంటుంది. ప్రపంచంలోని ఏ పెద్ద ఆర్థికవ్యవస్థ దేశంలోనూ లేని రీతిలో, భారత్‌లో ఎంత ఎక్కువ చదువుకుంటే అంత ఎక్కువ, ఎక్కువ కాలం నిరుద్యోగం ఉంది. చదువులేనివారు దాదాపు అందరూ రోజు కూలీ వంటి మార్గాల్లో ఉపాధి పొందుతుండగా, వానాకాలం చదువుతో పైపై అక్షరజ్ఞానం ఉన్నవారు ఏదోక కొలువులో జీవనోపాధి పొందుతున్నారు. అదే ఏళ్ల తరబడి స్కూలు, కాలేజీ, వర్సిటీ విద్య కోసం వెచ్చించే పిల్లలు చదువుకునే కాలం పెరుగుతున్న కొద్దీ ఆమేర నిరుద్యోగంలో కూరుకుపోతున్నారు. మన విద్య, ఆర్థిక వ్యవస్థల్లోని అపార సంక్షోభానికి ఈ భయంకర వాస్తవం అద్దం పడుతుంది. ఈ రెండు సంక్షోభాలనూ యుద్ధప్రాతిపదికన ఎదుర్కోవాలి. నిజానికి, అర్థవంతమైన చదువు, జనాభాలో అందరికీ ఎదిగే నిజమైన అవకాశాల్ని కల్పించటంలో ఒక సమాజంగా మన వైఫల్యానికి సంకేతమే రిజర్వేషన్ వంటి విషయాలపై ప్రజల మధ్య అగాధాలు పెరిగిపోతుండటం.

**(?) ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల సంగతేమిటి**

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ కోటాలు ఆచరణ సాధ్యం కాదు. ప్రభుత్వం బలవంతంగా అమలుచేయాలనుకుంటే, ప్రతికూల ఫలితాలస్తాయి. రాజ్యాంగపరంగా కూడా అవకాశం లేదు. కాబట్టి, ప్రైవేటు రంగంలో అందరికీ సమానావకాశాలు అందేలా చేయటం కోసం ఈ చర్యలను చేపట్టాలి.

1. ప్రస్తుత ఉద్యోగాల భర్తీ విధానం, అవసరమైన ఉద్యోగాల వివరాలు, భర్తీ చేసే అవకాశాలు – ఈ వివరాల్ని కంపెనీలు విధిగా వెల్లడించేలా చట్టపరమైన ఏర్పాట్లు ఉండాలి

2. ఈ వివరాల ఆధారంగా ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న పెద్దసంస్థలతో కలిసి ప్రభుత్వం నైపుణ్యాల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలి

3. ఉద్యోగాల భర్తీపై స్వతంత్ర పర్యవేక్షణ, రేటింగ్ ఉండాలి. ఒకేరంగంలోని, వేర్వేరు రంగాల్లోని సంస్థల ఉద్యోగాల భర్తీ వివరాల్ని పోల్చి చూస్తూ విశ్లేషణని ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచాలి

4. ఉద్యోగాల భర్తీలో వివక్ష చూపుతున్న కంపెనీలపై ప్రభుత్వం, పౌరసమాజం ఒత్తిడి తేవాలి. ప్రభుత్వ టెండర్లకు అర్హత కోల్పోయేలా చేయటం వంటి రూపాలలో ఈ ఒత్తిడి చేయాలి. అంతకంటే ముఖ్యంగా, ఓ కార్పొరేట్ సంస్థగనక వివక్షకు పాల్పడుతున్నట్టు స్పష్టంగా తేలితే, ఆ కంపెనీ ఉత్పత్తుల్ని, సేవల్ని పౌరసమాజం బహిష్కరించాలి. కంపెనీని దోషిగా నిలబెట్టి (నేమింగ్, షేమింగ్) మార్కెట్‌లో అవకాశాలు లేకుండా చేయటం ఉద్యోగాల భర్తీలో న్యాయమైన పద్ధతుల్ని అనుసరించటానికి గొప్ప మార్కెట్ మంత్రంలా పనిచేస్తుంది.

**(?) అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకుని ఒక సామాజిక ఉద్యమాన్ని ప్రారంభించే ప్రణాళికలేమైనా ఉన్నాయా? మీ సూచనల్ని/ప్రతిపాదనల్ని అమలు చేసేందుకు చర్యలేమిటి**

మొట్టమొదట, రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ ఆవశ్యకతను అందరం గుర్తించటం అవసరం. రిజర్వేషన్లు ఉండాలా, వద్దా? అనే ప్రశ్న కాదిది. దేశవ్యాప్తంగా ఏదో ఒక కుల సమూహం రిజర్వేషన్లలో చోటు కోసం ఆందోళనలకు దిగటాన్ని తరచూ చూస్తున్నాం. రిజర్వేషన్ల హేతుబద్ధీకరణపై నిజాయతీతో కూడిన చర్చకు ఈ సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలచాలి. ఈ ప్రతిపాదనల్ని మెరుగుపరిచే నిర్మాణాత్మక సూచనల్ని తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ ప్రతిపాదనలపై ఒక్కసారి విస్తృత ఏకాభిప్రాయం వస్తే ఇక బాధ్యత రాజకీయ సంకల్పం మీదే ఉంటుంది.

రిజర్వేషన్లు వెనకబాటుతనాన్ని, వివక్షని అంతం చేసే సర్వరోగనివారిణీ కావు, ఇతరులకు అవకాశాలు దక్కకుండా చేస్తున్న సమస్యా కావు. ఓ అసమాన సమాజంలో అవకాశాలు అందని ప్రజలకు స్థైర్యాన్ని, అవకాశాన్ని అందించేందుకు, అందరి మధ్యా సామరస్యాన్ని పెంచేందుకు అవి ముఖ్య సాధనం మాత్రమే. కాబట్టి, రిజర్వేషన్ల కోటాలలో ప్రవేశమే పరిష్కారమంటూ చేస్తున్న కుల ఉద్యమాలను, రాజకీయాలను మేం సమర్థించం. అటువంటి ఉద్యమాలు సమాజంలో అగాధాల్ని ఇంకా పెంచి, ఆటవిక భావోద్వేగాల్ని ప్రేరేపిస్తూ విద్వేషాల్ని తీవ్రతరం చేసి సామరస్యాన్ని దెబ్బతీస్తాయి. మనకు కావలసిందల్లా సహనం, అవగాహన, సంయమనం, తర్కం–సాక్ష్యాల ఆధారంగా నిరంతరం మెరుగుపరుచుకుంటుండటం, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించేందుకు బహుముఖ ప్రయత్నాలు, ప్రతి భారతీయునికీ అవకాశాల్ని అందించేందుకు నిజమైన, సంపద సృష్టించే ఉద్యోగాలను సృష్టించటం. ✪

# నిజమైన 'ప్రజాస్వామ్యం'తోనే 'కులరహిత' సమాజం

- **మల్లేపల్లి లక్ష్మయ్య**, సామాజిక విశ్లేషకులు



"**భా**రత రాజకీయాల్లో మహాత్మాగాంధీతోపాటు, డాక్టర్ అంబేద్కర్ మహాగొప్ప వ్యక్తి. హిందూ కులాల్లో పుట్టిన వాళ్లందరికన్నా మేధావి. ఇటువంటి వ్యక్తుల గొప్ప కృషి వల్ల కులవ్యవస్థతో కూడిన హిందూయిజం దెబ్బతినక తప్పదు. స్వతంత్ర వ్యక్తిత్వం, వివేకం, నిలువెత్తు నిజాయితీ కలిగిన అంబేద్కర్ భారతదేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ" అంటూ అంబేద్కర్‌ని కొనియాడిన వ్యక్తి మరోవరో కాదు రామ్ మనోహర్ లోహియానే. సోషలిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన రామ్ మనోహర్ లోహియా అంబేద్కర్ మరణానంతరం ఆయనపై చేసిన వ్యాఖ్య ఇది. నిజానికి బాబాసాహెబ్ అంబేద్కర్, రామ్ మనోహర్ లోహియాలు ప్రత్యక్షంగా కలుసుకున్న సందర్భం లేదు. కానీ ఆ ఇద్దరి మధ్యన ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. వారిద్దరి కలయిక కోసం ఏర్పాటు చేసుకున్న సమావేశం జరగక ముందే అంబేద్కర్ మహాపరినిర్వాణం చెందారు. తను ప్రారంభించిన "మాన్‌కైండ్" అనే పత్రికకు రాయాలని కోరుతూ రామ్ మనోహర్ లోహియా 1955 డిసెంబర్ పదవ తేదీన అంబేద్కర్‌కు ఒక ఉత్తరం రాశారు. ఆ తర్వాత ఇద్దరి మధ్యా సమకాలీన రాజకీయాలపై ఉత్తరాల ద్వారా కొంత చర్చ జరిగింది. 1956, అక్టోబర్ 5వ తేదీన అంబేద్కర్ ఒక ఉత్తరం రాస్తూ, లోహియాతో సమావేశం కావాలనే తన కోరికను వెలిబుచ్చుతారు. కానీ ఆ సమావేశం జరగకుండానే 1956, డిసెంబర్ 6వ తేదీన అంబేద్కర్ మరణించారు. 1957, జులై 1వ తేదీన లోహియా, ఆయన సన్నిహిత మిత్రుడు మధులిమాయేకు రాసిన ఉత్తరంలో పై విధంగా పేర్కొన్నారు.

1891, ఏప్రిల్ 14న జన్మించిన అంబేద్కర్ తన 26వ ఏట 1915లో కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. 1916లో "కులాల పుట్టుక"పై ఒక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత 1919లో సౌత్‌బరో కమిటీ ముందు అట్టడుగు వర్గాల, ప్రత్యేకించి అంటరాని కులాల రాజకీయ హక్కులపై ఒక సుదీర్ఘమైన అభ్యర్థన చేశారు. 1915లో ఆర్థికశాస్త్రంలో సాధించిన మాస్టర్స్ డిగ్రీతోపాటు, 1927లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ నుంచి డాక్టరేట్ పొందిన తర్వాత 1946లో "స్టేట్స్ అండ్ మైనారిటీస్'' అనే డాక్యుమెంట్‌ను రూపొందించారు. 1916లో అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో కులాల పుట్టుకను శోధించే ప్రయత్నం మొదలుపెట్టారు. 1927లో కుల వివక్షకు వ్యతిరేకంగా మహద్ చెరువు సత్యాగ్రహం, కాలారామ్ దేవాలయ ప్రవేశ ఉద్యమాలు ఆయన కార్యాచరణ కొనసాగింపు. 1935లో అంటరానితనం, కుల వివక్ష సమసిపోవాలంటే కుల నిర్మూలనే మార్గమంటూ భారత ప్రజలకు ఒక తాత్విక సైద్ధాంతిక భూమికను అందించారు. ఆ తర్వాత అంటరాని వారెవరు? శూద్రులెవరు? అన్న తన పరిశోధనలను కొనసాగిస్తూ, భారతదేశ కుల సమాజం అంతం కావడానికి బౌద్ధం చక్కటి పరిష్కార మార్గమని భావించి బుద్ధుడిని అనుసరించారు.

మూడో అంశంగా, రాజకీయ హక్కులు... 1919లో సౌత్‌బరో కమిటీ ముందు చేసిన ప్రసంగం మొదలుకొని 1955లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రణాళికను రూపొందించేంతవరకు ఆయన జీవితమంతా ఒక యుద్ధరంగమే. రణక్షేత్రం నుంచే ఆయన ఆలోచనలు సాగాయి. వయోజన ఓటింగ్ హక్కుతోపాటు, అన్ని వర్గాలకు, ప్రత్యేకించి అణగారిన వర్గాలకు రాజకీయ హక్కుల కోసం ఆయన తన సర్వస్వాన్నీ అంకితం చేశారు. అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రముఖ విద్యావేత్త జాన్ డ్యూయి

మార్గదర్శకత్వంలో అంబేడ్కర్ రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు. అప్పటికే అక్కడ జరుగుతున్న నల్లజాతి ప్రజల పోరాటాలు అంబేడ్కర్‌ను ప్రభావితం చేశాయి. రాజనీతి శాస్త్రంలో ప్రజాస్వామ్య భావనకు ఉన్న గొప్పతనాన్ని జాన్ డ్యూయి ద్వారా అంబేడ్కర్ అర్థం చేసుకోగలిగారు. అదే రాజకీయ హక్కుల పోరాట ఉధృతికి అంబేడ్కర్ నడుం కట్టేలా చేసింది. 1919లో సౌత్‌బరో కమిటీ ముందు ఇచ్చిన వాంగ్మూలంలో, సైమన్ కమిషన్ పర్యటనలో అంటరాని కులాల హక్కులపై గొంతెత్తి చాటారు. ఆ తర్వాత 1931, 32లలో లండన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశాలకు హాజరయ్యారు. ప్రత్యేక ఓటింగ్ హక్కు అయిన కమ్యూనల్ అవార్డు సాధించారు. గాంధీ కారణంగా పూనా ఒడంబడిక అనే బృహత్తర కార్యక్రమం నిలిచిపోయింది. దాని ఫలితంగా ప్రత్యేక ఓటింగ్ విధానం లేకుండా పోయింది.

అయితే 1935లో మొట్టమొదటిసారిగా 'భారత చట్టం' (ఇండియన్ యాక్ట్ 1935)ను బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దాని ప్రాతిపదికగా, 1937లో జరిగే ఎన్నికల్లో పాల్గనడం కోసం 1936లో అంబేడ్కర్ 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ' (ఐఎల్‌పి)ని స్థాపించారు. మహారాష్ట్రలో ఆ పార్టీ 17 స్థానాల్లో పోటీ చేయగా, 14 స్థానాల్లో విజయం సాధించింది. అందులో పదకొండు రిజర్వుడ్ స్థానాలుకాగా, మూడు జనరల్ స్థానాలు కూడా ఉన్నాయి. అప్పుడు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రత్యర్థి పార్టీగా ఉన్నది. అయితే జయప్రకాష్ నారాయణ్, ఆచార్య నరేంద్ర దేవ్, రామ్ మనోహర్ లోహియా స్థాపించిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ మాత్రం అంబేడ్కర్ నాయకత్వం వహిస్తున్న ఇండిపెండెంట్ లేబర్ పార్టీకి మద్దతు పలికింది. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ కేవలం అంటరాని కులాల కోసం ఆవిర్భవించిన పార్టీ కాదు. అంటరాని కులాల హక్కులు, వారి ప్రయోజనాలు ఆ పార్టీకి ముఖ్యమే కానీ అంతకు మించిన విస్తృతమైన ఆకాంక్షలతో ఆ పార్టీ అవతరించింది. అందుకే కార్మికుల, రైతు కూలీల హక్కులు ఆ పార్టీకి ప్రాథమిక లక్ష్యాలు అయ్యాయి. పరిశ్రమలు పూర్తిగా ప్రభుత్వ అధీనంలో నడవాలనేది ఆ లక్ష్యాల్లో ఒకటి. అంటే ఐఎల్‌పి కార్మికవర్గ దృక్పథంతో అవతరించిందనేది సుస్పష్టం. 1937 ఎన్నికల తర్వాత 'కేబినెట్ మిషన్' పేరుతో భారతదేశ రాజకీయ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనే అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన 'క్రిప్స్' కమిటీ ముందు కూడా అంబేడ్కర్ తన వాదనలను వినిపించారు. స్వతంత్ర భారతదేశంలో ఏర్పడే రాజ్యాంగంలో తమకు ప్రత్యేక హక్కులు ఉండాలని నిర్ద్వంద్వంగా ప్రతిపాదించారు. అయితే "లేబర్ పార్టీ నాయకుడైన నీకు అంటరాని కులాల కోసం ప్రత్యేకంగా మాట్లాడే హక్కు లేదు" అన్న కమిటీ మాటలను పరిగణలోకి తీసుకొని, ఇండింపెండెంట్ లేబర్ పార్టీ స్థానంలో ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ (ఎఐఎస్‌సిఎఫ్)ను స్థాపించారు. దీంతో షెడ్యూల్డ్ కులాల హక్కుల రక్షణ ఈ పార్టీ ప్రాథమిక ఎజెండాగా మారింది. 1942లో ఏర్పడిన ఈ పార్టీ రాజ్యాంగ సభ ఎన్నికల్లో, 1952 జనరల్ ఎన్నికల్లో పోటీ చేసింది. కొన్ని స్థానాలు గెలిచినప్పటికీ, అనుకున్నంత ఫలితాలు సాధించలేకపోయింది. దీనితో మళ్లీ అంబేడ్కర్ రాజకీయ ఉద్యమం నడపడానికి కేవలం షెడ్యూల్డ్ కులాల పేరుతో పార్టీ నిర్మాణం సరికాదని భావించారు. కుల ప్రాతిపదికగా ఏర్పడిన రాజకీయ పార్టీ విస్తృతమైన రాజకీయ వ్యవస్థను శాసించలేదని అంబేడ్కర్ అభిప్రాయం. అందుకే 1955లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పేరుతో ఒక రాజకీయ పార్టీకి అంకురార్పణ చేయాలని భావించి, ఒక ప్రణాళికను తయారుచేశారు.


భారత రాజ్యాంగంలోని పీఠికను ఆర్‌పీఐ ప్రాథమిక లక్ష్యంగా అంబేడ్కర్ ప్రకటించారు. ప్రణాళికలో ఆ పీఠికను యధాతథంగా పొందుపరిచారు. "న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం ఆశయాలుగా కొత్త పార్టీని ప్రకటించారు. కానీ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ మరణానంతరం మాత్రమే ఉనికిలోకి వచ్చింది. 1952 జనరల్ ఎన్నికల నుంచి అంబేడ్కర్ తన రాజకీయ గమ్యం, గమనం కోసం ప్రయత్నించారు. అందులో భాగంగానే సహజ మిత్రుల కోసం అన్వేషించారు. ఆ క్రమంలోనే సోషలిస్టు పార్టీ నాయకులు రామ్ మనోహర్ లోహియాతో అంబేడ్కర్‌కి సత్సంబంధాలేర్పడ్డాయి. కానీ వాళ్ల కలయిక జరగకుండానే, వారి రాజకీయ కల సాకారం కాకుండానే అంబేడ్కర్ కన్నుమూయడం పెద్దలోటు.

ఆ తర్వాత ఉనికిలోకి వచ్చిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మొదట్లో లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసినప్పటికీ, తర్వాత అంతర్గత కలహాలతో ఉనికినే పోగొట్టుకున్నది. అంబేడ్కర్ తన జీవిత చరమాంకంలో చేసిన రాజకీయ ఆలోచనలు, ఆశించిన కార్యాచరణ ఇంకా పూర్తి కాలేదు. షెడ్యూల్డ్ కులాల హక్కుల కోసం తుది శ్వాస వరకూ పోరాడినప్పటికీ, అంతిమంగా ఒక ప్రజాస్వామ్య సమాజంలోనే దీనికి సంపూర్ణ పరిష్కారం సాధ్యమని బలంగా అభిప్రాయపడ్డారు. ఒక మనిషికి ఒక ఓటు,

ఒక ఓటు – ఒక విలువ ద్వారా రాజకీయ ప్రజాస్వామ్యం లభించినప్పటికీ, ఆర్థిక, సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయని, రాజ్యాంగ సభ చివరి సమావేశం సందర్భంగా 1949, నవంబర్ 25న చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. కుల నిర్మూలన ద్వారా సామాజిక ప్రజాస్వామ్యం, ప్రజలందరికీ సమానావకాశాల ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ నియంత్రణ, ఆర్థిక ప్రజాస్వామ్యం అందించాలని అంబేద్కర్ అభిలషించారు. అందుకే భారతదేశంలోని కుల వ్యవస్థను, పెట్టుబడిదారీ వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించడానికి ఒక మహాప్రజాస్వామ్య ఉద్యమం ప్రారంభం కావాలి. ఆ ఆకాంక్షకు ఆచరణ రూపమివ్వడమే బాబాసాహెబ్‌కు ఘనమైన నివాళి.

(కర్టెసీ: సాక్షి)

# లక్ష్మయ్య గారి వ్యాసంపై లోక్‌సత్తా స్పందన




'కులరహిత సమాజమే ప్రజాస్వామ్యం' అంటూ మల్లేపల్లి లక్ష్మయ్యగారు రాసిన వ్యాసంతో లోక్‌సత్తా పూర్తిగా ఏకీభవిస్తుంది. ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఏం చేయాలో ఆ ఎజెండాను అవి సక్రమంగా అమలు చేస్తే, చిట్టచివరి పౌరునికి కూడా తన బతుకు మీద సాధికారతను కల్పించే నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతిని పాదుకొల్పితే.. కుల వివక్ష దానంతటదే తొలగిపోతుంది. రిజర్వేషన్లు వంటి ఉపశమనాల్ని ఇస్తామన్నా తీసుకునేవారుండరు. కానీ ప్రజాస్వామ్యాన్ని ఆధునిక రాచరికంలా మార్చేసి, ప్రజల పన్నుల డబ్బును నేతలు తమ జేబులో నుంచి ఇస్తున్న డబ్బుగా భ్రమింపచేస్తూ తాయిలాలిస్తూ దానకర్ణుల్లా ఫోజులివ్వటం వల్లే మన దేశంలో సంక్షోభం కొనసాగుతోంది. తాము కడుతున్న పన్నుల డబ్బుకు– ఎన్నికల్లో తాము వేసే ఓటుకు సంబంధమేంటో ప్రజలకు అర్థంగాని నామమాత్రపు ప్రజాస్వామ్యాన్ని దేశంలో కొనసాగిస్తున్నారు. దీన్ని మార్చి.. భారతదేశంలో 'నిజమైన ప్రజాస్వామ్యాన్ని పాదుకొల్పి అందరికి ఎదిగే అవకాశాలను కల్పించేందుకు, నివారించదగ్గ బాధలను తొలగించేందుకే' తెలుగు రాష్ట్రాలు కేంద్రంగా డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ 1996లో పార్టీలకతీతంగా ప్రజాస్వామ్య సంస్కరణల పీఠాన్ని (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్–ఎఫ్‌డీఆర్)ను ఏర్పాటు చేశారు. 'Democracy is the greatest leveller'అనే వాదనను దేశవ్యాప్తంగా వినిపిస్తూ ప్రజాస్వామ్య సంస్కరణలకు నిర్దిష్టమైన విధానాలను ప్రచారం చేశారు. ఇందుకోసం దేశ, విదేశాల అనుభవాలను, ఆలోచనలను లోతుగా అధ్యయనం చేశారు. దేశీయ పరిస్థితుల్లో ఆచరణకనుగుణంగా వాటిని మలిచారు. ఈ భావజాలంతో సామాన్యులు సైతం క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు 1997, 2006లో లోక్‌సత్తా ఉద్యమాన్ని, లోక్‌సత్తా పార్టీని జేపీ ప్రారంభించారు.

# ఈతరం కూడా తెలుసుకోవాల్సిన జీవితం సుబ్బాయమ్మ!

- పెన్మెత్స దుర్గాభవాని,
ఏపీ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి

ఇటీవల తాడేపల్లిగూడెంలో దివంగతులైన శ్రీమతి దూసనపూడి సుబ్బాయమ్మ జాతీయోద్యమ కాలంనాటి తొలితరం మహిళానేత, కమ్యూనిస్టు నాయకురాలు. ఏడున్నర దశాబ్దాల ప్రగతిశీల, వామపక్ష మహిళా ఉద్యమంలో దాదాపు ఐదు దశాబ్దాలపాటు క్రియాశీలకంగా పాల్గొన్న చరిత్ర సుబ్బాయమ్మ సొంతం. అవిద్య, మూఢనమ్మకాలు, సాంఘిక వెనుకబాటుతనం, మహిళల పట్ల తీవ్ర వివక్ష కొనసాగుతున్న రోజులలో కఠినమైన సాంఘిక మూస చట్రం నుండి బైటకొచ్చిన తొలితరం మహిళా ఉద్యమ కార్యకర్తలలో సుబ్బాయమ్మ ఒకరు. మహిళా సమస్యలపై సాగిన ఉద్యమాలకు మహిళలను సమీకరించి ఎన్నో పోరాటాలలో ఆమె పాల్గొన్నారు. మహిళల ఆకాంక్షలను, సమస్యలను ప్రతిబింబించే నినాదాలను ప్రాచుర్యంలోకి తేవడంతోపాటు, వాటికి సామాజిక ఆమోదం తీసుకురావడంలో తొలితరం మహిళా నేతల కృషి అనన్య సామాన్యం. అందులో సుబ్బాయమ్మ వంటి కార్యకర్తల కృషి చిరస్మరణీయమైనది.

తాడేపల్లిగూడెం పట్టణ ప్రముఖులు, మోడ్రన్ కేఫ్ హోటల్ వ్యవస్థాపకులు పైబోయిన వెంకట్రామయ్య, కొండమ్మ దంపతులకు 1931లో సుబ్బాయమ్మ జన్మించారు. ఐదవ తరగతి వరకు చదువుకున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ కమ్యూనిస్టు ఉద్యమంలో భాగస్వాములు కావడంతో సుబ్బాయమ్మపై కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం చిన్నతనంలోనే పడింది. తల్లి కొండమ్మ మహిళా సంఘం ఏర్పడిన తొలినాళ్ల నుండి చురుగ్గా పాల్గన్నారు. తల్లితోపాటు సుబ్బాయమ్మ కూడా పాల్గనడం ప్రారంభించారు. 1943, డిసెంబర్ 24, 25 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా నవుదూరులో జరిగిన జిల్లా మహిళా సంఘం మహాసభలకు తన తల్లి, సోదరితోపాటు సుబ్బాయమ్మ హాజరయ్యారు.

నాటి మహిళా ఉద్యమనేతలు డా।। కె. అచ్చమాంబ, మానికొండ సూర్యావతి, సంకు లక్ష్మీకాంతం, భూపతిరాజు లక్ష్మీకాంతమ్మ తదితరుల ప్రసంగాలతో సుబ్బాయమ్మ ఉత్తేజితులయ్యారు. నవుదూరు మహిళా మహాసభ చర్చించిన అంశాలు, ఆమోదించిన తీర్మానాలు అనంతర కాలపు మహిళా ఉద్యమానికి దిశానిర్దేశం చేశాయి. నాటి మహిళా ఉద్యమ కార్యకర్తల దూరదృష్టి ఆ తీర్మానాలలో ప్రతిబింబించుతుంది. మహిళలకు ఆస్తిలో వారసత్వ హక్కు, వివాహాల తప్పనిసరి రిజిస్ట్రేషన్, విడాకుల హక్కు, బాల్య వివాహాల నిషేధం, బాలికలకు ప్రత్యేక పాఠశాలలు, ప్రతి గ్రామంలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, ప్రతి గ్రామంలో శిక్షణ పొందిన ప్రసూతి కార్యకర్తల నియామకం, వ్యవసాయ పనులలో పాల్గనే మహిళలకు పురుషులతో సమానంగా వేతనం, మద్యనిషేధం వంటి సమస్యలపై నదువూరు మహాసభ తీర్మానాలు చేసింది. క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టు చేసిన నేతలను విడుదల చెయ్యాలని, బెంగాల్ కరువు బాధితుల సహాయ కార్యక్రమాల కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఐక్యంగా కృషి చేయాలని, ఫాసిస్టు శక్తుల ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడాలని మహిళా మహాసభ కోరింది. గ్రామాలలో బాల సంఘాలను ఏర్పాటు చెయ్యాలని, పిల్లలను దేశభక్తియుత పౌరులుగా తయారు చెయ్యాలని మహిళలకు మహాసభ పిలుపు ఇచ్చింది.

నవుదూరు మహాసభ ఉత్సాహంతో జిల్లాలో మహిళా ఉద్యమం బాగా విస్తరించింది. సుబ్బాయమ్మ 1944, 1945, 1946 సంవత్సరాలలో మందలపర్తి శేషమ్మ, యాళ్లబండి పుణ్యవతి, సంకు లక్ష్మీకాంతమ్మ వంటి వారితో కలిసి తాలూకాలోని పలు గ్రామాలలో మహిళా సంఘాల ఏర్పాటులో కృషి చేశారు. 1947 ఫిబ్రవరి 15, 16 తేదీలలో తెనాలి తాలూకా చిలువూరులో జరిగిన ఆంధ్ర రాష్ట్ర మహిళా సంఘం ప్రథమ మహాసభకు సుబ్బాయమ్మ తన తల్లి, అక్కలతో కలిసి హాజరయ్యారు. చిలువూరు మహాసభ సుబ్బాయమ్మ ఆలోచనలకు పదును పెట్టింది. మహిళా ఉద్యమంలో కమ్యూనిస్టు పట్టుదల కలిగిన ఒక కార్యకర్తగా సుబ్బాయమ్మ రూపొందడంలో నవుదూరు, చిలువూరు మహిళా మహాసభలు కీలక ప్రభావాన్ని వేశాయి.

1947 డిసెంబర్ 26న సుబ్బాయమ్మ వివాహం అప్పటికే స్వాతంత్ర్యోద్యమంలో రెండుసార్లు జైలుకు వెళ్లివచ్చిన కమ్యూనిస్టు నాయకుడు దూసనపూడి విరాటరాజుతో జరిగింది. ఈ వివాహం జరిపించడానికి సంకు అప్పారావు, ఎంవిఎన్ కపర్దీ, స్వాతంత్ర్య సమరయోధులు పసల కృష్ణమూర్తి పూనుకున్నారు. డిసెంబర్ 26 పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

## జేపీ నివాళి



దూసనపూడి సుబ్బాయమ్మ పోరాట పటిమ, సామాజిక స్పృహ నేటి యువతకు ఆదర్శమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ నివాళులర్పించారు. ఆమె స్ఫూర్తితో ప్రతి యువకుడూ సమాజం కోసం కొంత నాణ్యమైన సమయాన్ని వెచ్చించాలని, ప్రతి యువతీ మహిళా సాధికారత కోసం కృషి చేస్తూ సమాజంలో మార్పు కోసం తన వంతు ప్రయత్నం చేయాలని అన్నారు. సుబ్బాయమ్మ కుమారుడు, లోక్‌సత్తా జనబలం వర్కింగ్ ఎడిటర్ దూసనపూడి సోమసుందర్‌కు, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సందర్భంగా వివాహ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు నేత ఉద్దరాజు రామం అధ్యక్షతన, సంకు అప్పారావు ఆచార్యత్వంలో దండల మార్పిడి ద్వారా సంస్కరణ వివాహం జరిగింది. అదే సందర్భంగా పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశం కూడా అదే ప్రాంగణంలో జరిగింది. ఆ తర్వాత పార్టీ నేతలంతా అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. విరాటరాజు కూడా అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు.

1948-52 మధ్య కమ్యూనిస్టు పార్టీపై నిషేధం అమలులో ఉండటంతో విరాటరాజు కుటుంబం తీవ్ర నిర్బంధాలను ఎదుర్కోవలసి వచ్చింది. విరాటరాజు తండ్రి నరసయ్యను పోలీసులు చితకబాదడంతో ఆయన కాళ్లు విరిగాయి. విరాటరాజు సోదరులు కొండయ్య, గెరాటరాజు, కృష్ణమూర్తిలను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. పలుసార్లు ఇంటిపై దాడులు జరిగాయి. భయోత్పాతం సృష్టించడానికి ఇంట్లో సామాగ్రిని, ఆహారపదార్థాలను, తలుపులను, ద్వారబంధాలను పగులగొట్టేవారు. పార్టీ నాయకుల ఆచూకీ చెప్పాలని కుటుంబ సభ్యులను హింసించేవారు. ఇంతటి తీవ్ర నిర్బంధకాండను సుబ్బాయమ్మ ఎంతో నిబ్బరంగా ఎదుర్కొన్నారు. వివాహమైన రెండు నెలలకే సుబ్బాయమ్మ సైతం జైలుకు వెళ్లాల్సి వచ్చింది. 1948 ఫిబ్రవరిలో మహిళా సంఘం కార్యకర్తల రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు విజయవాడలో జరిగాయి. దానికి సుబ్బాయమ్మ హాజరయ్యారు. కమ్యూనిస్టు మహిళలకు బాంబుల తయారీలో శిక్షణ ఇస్తున్నారన్న అభియోగంలో నాటి సబ్‌కలెక్టరు శిక్షణా తరగతులను నిషేధించారు. తమది మహిళా సంఘమనీ, మహిళా సమస్యలపై శిక్షణ ఇస్తున్నారనీ, తమపై నిషేధం విధించడం సమంజసం కాదని తరగతులకు హాజరైన మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ ప్రదర్శనను సైతం నిషేధించడంతో పోలీసులు లాఠీఛార్జీ చేసి మహిళలను అరెస్టు చేశారు. ఆనాటి ప్రదర్శనలో పాల్గొన్న సుబ్బాయమ్మ అరెస్టయ్యారు. శ్రీమతి వంక నాగమణితో కలిసి నందిగామ జైలులో శిక్ష అనుభవించారు. జైలు నుండి విడుదల అయినప్పటికీ పోలీసులు ఆమెను వేధిస్తూనే వచ్చారు. విరాటరాజు ఆచూకీ గురించి పార్టీ నేతల రాకపోకల గురించి అధికారులు సుబ్బాయమ్మను పలుమార్లు వేధించారు. నాటి డీఎస్పీ ఒకరు రివాల్వరు చూపించి నీ భర్తను కాల్చి చంపుతామని సుబ్బాయమ్మను బెదిరించారు. అయినప్పటికీ ఆమె జంకలేదు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఆశ్రయం కల్పిస్తూనే వచ్చారు. సుబ్బాయమ్మ అన్నగారు పైబోయిన సోమయ్య నాటి గెరిల్లా దళ సభ్యునిగా పలు దళ చర్యలలో పాలుపంచుకున్నారు.

1952 తర్వాత దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సుబ్బాయమ్మ మహిళా సంఘం, కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. 1953లో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలు తణుకులో జరిగిన సందర్భంలో మహిళలను సమీకరించడంలో కృషి చేశారు. 1966లో రైతు సంఘం రాష్ట్ర మహాసభలు తాడేపల్లిగూడెంలో జరిగిన సందర్భంలో మహిళా వాలంటీర్ల బృందంలో పనిచేశారు. 1981లో మహిళా నవఖ్య రాష్ట్ర మహాసభలు తాడేపల్లిగూడెంలో జరిగినప్పుడు మహాసభలను విజయవంతం చేయడంలో ముఖ్యపాత్ర పోషించారు.

1952 నుండి 1994 వరకూ జరిగిన అన్ని ఎన్నికలలో పార్టీ అభ్యర్థులు బలపరిచిన అభ్యర్థుల విజయానికి మహిళా ప్రచార దళాలను ఏర్పరచి సారథ్యం వహించారు. పార్టీ ఉద్యమాలలో చురుగ్గా పాల్గన్నారు. పలు ఉద్యమాల సందర్భంగా అరెస్టయ్యారు. మహిళా సంఘం పిలుపు మేరకు రాత్రి పాఠశాలలు ఏర్పాటు చేశారు. కుట్టు శిక్షణా కేంద్రాల ద్వారా స్వయంఉపాధి శిక్షణ ఇప్పించారు. తొలి నుండి కులాంతర, మతాంతర, సంస్కరణ వివాహాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అటువంటి వివాహాల సందర్భంగా కుటుంబాల నుండి ప్రతిఘటన ఎదుర్కొన్న జంటలకు ఇంటిలో ఆశ్రయం కల్పించారు. తన కుటుంబంలో కూడా కులాంతర, సాంఘిక వివాహాలు జరిపించి ఆదర్శంగా నిలిచారు. భర్తల, అత్తమామల నిరాదరణకు, అకృత్యాలకు ఇబ్బందులు పడిన పలువురు

మహిళలకు ఆశ్రయం కల్పించారు. విద్యార్థి యువజనోద్యమాలలో తిరుగుతున్నందుకు కుటుంబాల ఆగ్రహానికి గురయిన పలువురు కార్యకర్తలకు నెలల తరబడి తన ఇంటిలో ఆశ్రయం కల్పించి అమ్మలా ఆదరించారు. పార్టీ కుటుంబాలలోని పిల్లల చదువులకు తోడ్పాటు అందించారు. మద్య వ్యతిరేక పోరాటాలలో, వరకట్న నిషేధం, వరకట్న వేధింపులు, అత్యాచార బాధితులు వంటి సమస్యలపై మహిళా సంఘం ఇచ్చిన కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుజ్జుల సరళాదేవి, సంకు లక్ష్మీకాంతమ్మ, వల్లూరి హైమావతి తదితరులతో కలిసి సుబ్బాయమ్మ పనిచేశారు. తన తర్వాత తరం మహిళా కార్యకర్తలు కాళ్ల ధనలక్ష్మి, బోణం ధనలక్ష్మి, జాస్తి నిర్మల, మందలపర్తి సంధ్యారాణి, ఇందుకూరి సీతమ్మ, పెన్మత్స సీతమ్మ, ఉద్దరాజు బంగారమ్మ, రెడ్డి కల్పనాదత్, పూడియాగ్రావమ్మ, మద్ది సీతమ్మ, మనోరమ వంటి వారితో కలిసి ఆమె మహిళా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు.

వయసు పైబడిన తర్వాత ఆమె తాడేపల్లిగూడెంలోని తన ఇంటికే పరిమితమయ్యారు. ఆమె భర్త విరాటరాజు 2008లో కన్నుమూశారు. నేత్రదానం చేసిన ఆమె భౌతిక కాయాన్ని ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాలకు అప్పగించారు. దృఢసంకల్పానికి, నిర్భీతికి, నిరాడంబరత్వానికి ప్రతీకగా నిలిచిన దూసనపూడి సుబ్బాయమ్మ నేటితరం మహిళా ఉద్యమ కార్యకర్తలకు ఆదర్శం. నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి చూపిన కార్యశీలి ఆమె. నాటితరం మహిళా ఉద్యమ కార్యకర్తలు చేసిన పోరాటాలు, త్యాగాలతోనే మహిళలు ఈ మేరకైనా ముందంజ వేయగలుగుతున్నారు. దూసనపూడి సుబ్బాయమ్మ వంటి వారు వేసిన పునాదులపైనే మహిళా ఉద్యమం పలు విజయాలు సాధించగలిగిందని చెప్పవచ్చు. సుబ్బాయమ్మ వంటి వారి కృషి భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. నేడు మహిళలకు ఇంటా బయటా రక్షణ కరువైంది. అన్ని రంగాల్లో లింగవివక్ష కొనసాగుతోంది. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల మహిళల పరిస్థితి దుర్భరంగా మారుతోంది. ఆరోగ్య, ఆహార, ఉద్యోగ భద్రతలు కరువయ్యాయి. నిర్ణయాధికారాల్లో మహిళల భాగస్వామ్యం నేటికీ అందని ద్రాక్షగానే మిగిలింది. సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళలకు సమప్రాతినిధ్యం కోసం సుబ్బాయమ్మ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పోరాడాల్సిన బాధ్యత మనపై ఉంది. అదే ఆమెకు మనం సమర్పించే ఘనమైన నివాళి. ☼



## మిల్లుల్ని తెరిపించి కార్మికుల్ని ఆదుకోండి

గడచిన నాలుగు సంవత్సరాలుగా విజయనగరం జిల్లాలోని జ్యూట్ మిల్లులు మూతపడి వేలాది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఎంతో పేరుప్రతిష్ఠలున్న నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు కూడా ఇటీవల మూతపడిందని, దీనిపై ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకుని మిల్లుల్ని తెరిపించాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ రాష్ట్ర కార్మికమంత్రి పితాని సత్యనారాయణను అమరావతిలో కలిసి విజ్ఞప్తి చేశారు. మూతపడ్డ మిల్లుల్లో కార్మికులకు పాత బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. పరిశ్రమలు మూతపడి నిరుద్యోగం ప్రబలుతున్న జిల్లాగా విజయనగరం పేరు మోస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారని, ఇంత కేంద్రీకృత పాలన ఉంటే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందని బాబ్జీ ఈ సందర్భంగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. మంత్రిని కలిసినవారిలో యువసత్తా ప్రతినిధి రవితేజా కూడా ఉన్నారు.




"పురుషునితో సమానమైన స్థితికి స్త్రీ రానంతవరకూ
మనకు పక్షవాతం వచ్చినట్లే ఎంచుకోవాలి.
మన కాలూ చేయీ పడిపోయినట్లే భావించాలి"

– మహాత్మాగాంధీ

# వైరల్ అబద్ధాలను అరికట్టే 'ఫ్యాక్ట్ చెకర్స్'

- **సప్తగిరి గోపనేని,** పాత్రికేయుడు

***వాస్తవాలను వక్రీకరించడం, జరగని సంఘటనలను జరిగినట్లుగా భ్రమింపజేయడం, ఫోటోలను మార్ఫింగ్ చేయడం, వీడియోలను ఎడిట్ చేయడం వంటి చర్యల వల్ల అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పెడధోరణులు ఫేక్‌న్యూస్‌కు వాహకాలుగా మారుతున్నాయి. వాస్తవ సమాచారవ్యాప్తికి సవాలుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ఫేక్ న్యూస్ డిటెక్టింగ్' తప్పనిసరిగా మారుతోంది. ప్రతి సమాచారానికి 'ఫ్యాక్ట్ చెక్' అనివార్యమవుతోంది.***

పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, సమాచార వ్యాప్తిలో శరవేగం అనుకూలతకే కాదు, ప్రతికూలతలకూ కారణమవు తున్నాయి. తెలిసో, తెలియకో తప్పుడు వార్తల వ్యాప్తికి దోహద పడుతున్నాయి. కొందరేమో తెలియకుండా ఫార్వార్డ్, షేరింగ్ చేస్తుండగా, మరికొందరు ఇలాంటి వార్తలను పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా నేరవార్తలు, రాజకీయ వార్తలు ఇలా రెక్కలు కట్టుకొని షికార్లు చేస్తున్నాయి. వాట్సప్‌తోపాటు ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్... ఇలా అందుబాటులో ఉన్న అన్ని మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారుతున్నాయి. కొంతకాలంగా ఈ సమస్య ఎక్కువైంది. సరిదిద్దలేనంతగా ముదిరిపోయింది. ప్రధానంగా సోషల్ మీడియా వినియోగం విస్తృతం కావడం, స్మార్ట్‌ఫోన్ హస్తభూషణంలా మారిపోవడం ఈ పరిణామాలకు దారితీస్తున్నాయి. వాస్తవాలను వక్రీకరించడం, జరగని సంఘటనలను జరిగినట్లుగా భ్రమింప జేయడం, ఫోటోల మార్ఫింగ్, వీడియోలను ఎడిట్ చేయడం వంటి చర్యల వల్ల అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా కొంతకాలం క్రితం మూకదాడులు పలు రాష్ట్రాలను వణికించాయి. పిల్లలను ఎత్తుకుపోయేవాళ్లు తిరుగుతున్నారంటూ సోషల్ మీడియాలో విపరీతంగా సాగిన ప్రచారం పదుల సంఖ్యలో అమాయకుల హత్యకు దారితీసింది. అత్యంత ఘోరంగా రాళ్లతో, కర్రలతో కొట్టి చంపిన దుర్మార్గాలు ఇంకా మదిలో మెదులుతూనే ఉన్నాయి.




బాధ్యతారహితంగా సాగిన ఈ ప్రచారంతో విశాఖలో ఓ అమాయకుడిని రాళ్లతో కొట్టిచంపారు. 2018 మే 22న నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం చెంగల్‌లో తోటపని చేసేందుకు వచ్చిన పక్క గ్రామానికి చెందిన ఇద్దరు ఆదివాసీలను దొంగలు గా భావించి స్థానికులు విచక్షణా రహితంగా వారిపై దాడి చేశారు. గ్రామస్తులు కొట్టిన దెబ్బలకు తాళలేక ఓ వ్యక్తి చనిపోయాడు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బీబీనగర్ మండలం జియాపల్లిలో బాలకృష్ణ అనే వ్యక్తిని గ్రామస్తులంతా కలిసి కొట్టి చంపేశారు. తనది పక్కనే ఉన్న కొర్రేముల గ్రామం అనీ, ఆటోడ్రైవర్ననీ చెబుతున్నా వినకుండా తోటి మనుషులే అరాచకానికి పాల్పడ్డారు. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు తీవ్ర కలకలం రేపాయి. అసోంలోనూ గత జూన్ తొమ్మిదో తేదీన దోక్మోక గ్రామస్తులు పిల్లలను అపహరించేవాళ్లుగా అనుమానించి కారులో వెళ్తున్న ఇద్దరిని బయటకు లాగి కొట్టిచంపారు. తాము అసోంవాసులమని మొత్తుకుంటున్నా వినని గ్రామస్తులు అభిజీత్ నాథ్, నీలోత్పాల్ దాస్ అనే ఇద్దరినీ హత్య చేశారు. తమిళనాడులోని తిరువణ్ణామలై ప్రాంతంలోనూ 65 ఏళ్ల మహిళను ఇలాగే అనుమానించి కొట్టి చంపేశారు. రోజురోజుకూ ఇలాంటి దాడులు ఎక్కువ కావడంతో సాక్షాత్తూ రాష్ట్ర ప్రభుత్వాలే రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఎక్కడికక్కడ తప్పుడు ప్రచారాల వ్యాప్తికి చెక్ పెట్టడం, వాటిని వైరల్ చేసిన వాళ్లను అరెస్ట్ చేయడంతో అరాచకాలకు కొంతమేర అడ్డుకట్ట పడింది.

ఇలా సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారం ఊహించని పరిస్థితులకు కారణమవుతున్నది. 2018 మే, జూన్ నెలల్లో సోషల్ మీడియాలో సాగిన తప్పుడు ప్రచారం కారణంగా దేశవ్యాప్తంగా ఇలా 29 మంది జనం చేతిలో అత్యంత క్రూరంగా ప్రాణాలు కోల్పోయారు. సోషల్ మీడియాలో గేట్ కీపింగ్ లేకపోవడం, తమకు తెలిసిన సమాచారం వాస్తవమా, ఎవరైనా కావాలని సృష్టించిందా అని

విశ్లేషించే సామర్థ్యం సోషల్ మీడియా వెబ్‌సైట్లు, ఛానళ్ల క్రియేటర్లు, వినియోగదారుల్లో లోపించడం వంటి అంశాలు ప్రధానంగా ఈ పరిణామాలకు కారణమవుతున్నాయి.


మరోవైపు రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం వెల్లువలా వెదజల్లడం కొంతమందికి సరదాగా మారింది. ఎప్పుడో తీసిన వీడియోలను ఉపయోగించి ఇప్పటి పరిస్థితులను కలుషితం చేసేలా ప్రచారం చేయడం, ఫోటోలను మార్ఫింగ్ చేసి ప్రజలను సందిగ్ధంలో పడేయడం వంటి చర్యలు పెడధోరణులకు పరాకాష్ఠగా చెప్పుకోవచ్చు. ఆ మధ్య రాహుల్‌గాంధీ ఎడమచెయ్యితో జాతీయ పతాకానికి సెల్యూట్ చేశాడంటూ 'మోడిఫైడ్ ఇండియా' క్యాంపెయిన్ ట్యాగ్‌తో సోషల్ మీడియాలో ఓ ఫోటో విస్తృతంగా హల్‌చల్ చేసింది. కానీ ఆ ఫోటోను హారిజాంటల్‌గా ఫ్లిప్ చేసి కుడిచేయిని ఎడమచేయిగా మార్చి తప్పుడు ప్రచారం చేశారని తేలింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర పోలీస్ అధికారి ఒకరు తెలంగాణ తీన్‌మార్ సాంగ్‌కు మైమరచిపోయి స్టెప్పులేయడం వాట్సప్‌లో వైరల్ అయ్యింది. అదీ అధికారపార్టీ టీఆర్ఎస్ కండువాలు వేసుకున్నవాళ్లతో కలిసి చేస్తున్న డ్యాన్స్‌లు అందరినీ ఆలోచింపజేశాయి. తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఓ పోలీస్ అధికారి, అతనితోపాటు ఓ కానిస్టేబుల్ తెలంగాణ పాటకు టీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి స్టెప్పులు వేయడం సహజంగానే చర్చను లేవనెత్తింది. నిమిషాలు, గంటల్లోనే ఆ వీడియో వందలాది వాట్సప్ గ్రూపుల్లో శరవేగంగా వాలిపోయింది. వేలాదిమంది ఆ వీడియోను చూసి తమ అభిప్రాయాలు కూడా అంతే వేగంగా షేర్ చేశారు. ఎన్నికల ప్రచారంలో పోలీసులు టీఆర్ఎస్ అభ్యర్థులకు సహకరిస్తున్నారన్న వాదనలు వినిపించాయి. కానీ.. వాస్తవానికి 2015 జూన్ రెండో తేదీన రికార్డు చేసిన వీడియో అది. 2017లోనే యూట్యూబ్‌లో అప్‌లోడ్ కూడా అయ్యింది. కానీ.. ప్రత్యర్థులే కావాలని ఎన్నికల సమయంలో ఆ వీడియోను ఉద్దేశపూర్వకంగా వాట్సప్‌లో షేర్ చేశారని తేలింది. ఇదంతా ఓ ఎత్తు అయితే.. మెయిన్ స్ట్రీమ్ మీడియాను కూడా తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మరింత తీవ్రమయ్యాయి. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలను పోలిన లోగోలతో, వాటి పేర్లలో కొద్దిపాటి మార్పులతో కొంతకాలంగా తప్పుడు వార్తలు, పుకార్లను డంప్ చేయడం నిత్యకృత్యంగా మారుతోంది. అసలు లోగోలో ఒక్క అక్షరాన్ని మాత్రమే మార్చి పాఠకులు కనీసం గుర్తుపట్టలేని విధంగా నిర్ధారించని సమాచారాన్ని పోస్ట్ చేస్తున్నారు. ఉదాహరణకు ఎఎన్ఐ న్యూస్ ఏజెన్సీని పోలిన లోగో, టైమ్స్‌నౌ వార్తాసంస్థను పోలిన విధంగా 'టైమ్స్‌హౌ', టైమ్స్ ఆఫ్ ఇండియా సంస్థ లోగోను పోలిన విధంగా 'టిఓఐ'కి బదులు 'ఎల్ఓఐ', రిపబ్లిక్ టీవీ లోగోను పోలిన మాదిరిగా మరో తప్పుడు లోగో ఇలా ఆన్‌లైన్, వెబ్ ఎడిషన్లను కలుషితం చేస్తున్నాయి. వాస్తవ సమాచారవ్యాప్తికి సవాలుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ఫేక్ న్యూస్ డిటెక్టింగ్' తప్పనిసరిగా మారుతోంది. ప్రతి సమాచారానికి 'ఫ్యాక్ట్ చెక్' అనివార్యమవుతోంది.


ఇంటర్నెట్‌లో ఏ రకమైన సమాచారానికైనా గూగుల్ గేట్‌వేగా ఉంది. అది వాస్తవ సమాచారమైనా, తప్పుడు సమాచారమైనా గూగుల్ మనకు అవసరమైన అన్నింటినీ దరిచేరుస్తోంది. ఏ అంశం వెతికితే ఆ అంశం మన కళ్లెదుటకు తీసుకొస్తోంది. అయితే తప్పుడు సమాచారం గూగుల్ అన్వేషకులను తప్పుదోవ పట్టిస్తోంది. కొంతకాలంగా ఈ సమస్య తీవ్రత పెరిగింది. దీంతో సమాచారాన్ని, వార్తలను 'ఫ్యాక్ట్ చెక్' చేయడానికి గూగుల్ నడుం బిగించింది. 'గూగుల్ న్యూస్ ఇనీషియేటివ్'ను ప్రారంభించింది. దీనికి అనుబంధంగా భారతదేశంలో 'ఇండియా ట్రైనింగ్ నెట్‌వర్క్'ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 200 మంది శిక్షకులను తయారుచేసింది. ఎక్కడికక్కడ సమాచారం 'ఫ్యాక్ట్ చెక్' చేయడంలో ప్రధానంగా జర్నలిస్టులకు మెళకువలు నేర్పిస్తోంది. ఏడాదిలో దేశవ్యాప్తంగా 8వేల మంది జర్నలిస్టులకు శిక్షణ ఇప్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. తప్పుడు సమాచారానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను గుర్తించడం, అవి ఎప్పటివో నిర్ధారించుకోవడం, వాటిని ఉద్దేశపూర్వకంగానో, అనుకోకుండానో వ్యాప్తి చేస్తున్నవాళ్ల వివరాలు కనుక్కోవడం ప్రధాన అంశాలుగా 'గూగుల్ న్యూస్ ఇనీషియేటివ్ ఇండియా ట్రైనింగ్ నెట్‌వర్క్' పనిచేస్తోంది. ఇవే అంశాలపై జర్నలిస్టులకు, జర్నలిజం విద్యార్థులకు ఈ నెట్‌వర్క్ శిక్షణనిస్తోంది.

ఈ శిక్షణలో అందించే మెళకువలు, అవసరమయ్యే టూల్స్‌ను ఉపయోగించుకొని వైరల్ వీడియోలు గానీ, ఫోటోలుగానీ వాస్తవమేనా, ఎవరైనా కావాలని క్రియేట్ చేసినవా అనే విషయమై క్రాస్ చెక్ చేసుకోవడం సులువు అవుతుంది. అంతేకాదు, అవి ఒకవేళ పాతవి అయినా నిర్ధారించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఎవరికివారు విధిగా వీటిని పాటిస్తేనే 'ఫ్యాక్ట్ చెక్' సమర్థంగా జరుగుతుంది. మెయిన్‌స్ట్రీమ్ మీడియా 'గూగుల్ న్యూస్ ఇనీషియేటివ్' సూత్రాలను ఫాలో అవడం ద్వారా 'ఫేక్ న్యూస్'కు చెక్ పెట్టే అవకాశం ఉన్నా, సోషల్ మీడియా క్రియేటర్లు కూడా ఎవరికివారు సెన్సేషన్ కోసం చూడకుండా 'ఫ్యాక్ట్ చెక్'ను విధిగా పాటిస్తే జీఎన్ఐ లక్ష్యం కొంతైనా నెరవేరుతుంది. సమాజాన్ని కూడా తప్పుదారి పట్టించకుండా ఎవరికివారు తమవంతు బాధ్యత నెరవేర్చిన సంతృప్తి లభిస్తుంది. ✡


(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# ఎ.పికి విభజన హామీలపై స్వతంత్ర నిపుణుల నివేదికను అన్ని ప్రధాన పార్టీల నేతలకూ పంపిన జేపీ









రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు యూనియన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలని, వాటి అమలులో ప్రస్తుత పరిస్థితిని నిష్పాక్షికంగా, పార్టీలకతీతంగా, భావోద్వేగాలకతీతంగా అధ్యయనం చేసేందుకు ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ - ఎఫ్‌డిఆర్) ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల బృందం (ఇండిపెండెంట్ గ్రూప్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ - ఐజిఇ) ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రతుల్ని ఐజిఇ కన్వీనర్, ఎఫ్‌డిఆర్ ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ ఎ.పిలోని అన్ని ప్రధాన పార్టీల అధ్యక్షులకు, శాసనసభా పక్ష నేతలకు పంపారు.

నారా చంద్రబాబు నాయుడు (ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి), వైఎస్ జగన్మోహన్ రెడ్డి (ఎ.పి ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు), కిమిడి కళా వెంకట్రావు (తెలుగుదేశం పార్టీ ఎ.పి అధ్యక్షులు), పవన్ కళ్యాణ్ (జనసేన పార్టీ అధ్యక్షులు), కె. రామకృష్ణ (సిపిఐ రాష్ట్ర కార్యదర్శి), పి. మధు (సిపిఎం ఎ.పి కార్యదర్శి), రఘువీరారెడ్డి (కాంగ్రెస్ పార్టీ ఎ.పి అధ్యక్షులు), కన్నా లక్ష్మీనారాయణ (బిజెపి రాష్ట్ర అధ్యక్షులు), పి. విష్ణుకుమార్ రాజు (బిజెపి శాసనసభా పక్ష నేత)లకు ఐజిఇ నివేదిక పుస్తకాల్ని జేపీ పంపారు.

వాస్తవాలతో కూడిన నిర్మాణాత్మక బహిరంగ చర్చను లేవనెత్తి, ప్రత్యేక తరగతి హోదా సహా సంక్లిష్టమైన, వివాదాస్పదమైన అంశాలను నిజమైన ఫెడరల్ స్ఫూర్తితో పరిష్కరించుకోవటానికి పార్టీల నాయకత్వం, భాగస్వామ్యం ఎంతగానో దోహదం చేస్తాయని ఆశిస్తున్నట్లు నివేదిక పుస్తకానికి జత చేసి పంపిన లేఖలో జేపీ పేర్కొన్నారు.

వివరాలను జేపీ మీడియాకు విడుదల చేశారు. నివేదికతో పాటు పార్టీల నేతలకు జేపీ రాసిన లేఖ పూర్తి పాఠం:

“ఆంధ్రప్రదేశ్ విభజనకు సంబంధించి అనేక వివాదాస్పద అంశాలున్న సంగతి మీకు తెలుసు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ద్వారా, పార్లమెంటులో ప్రధానమంత్రి ప్రకటన ద్వారా ఇచ్చిన నిబద్ధ హామీల్లో అనేకం నిర్దిష్టమైనవీ, ఎటువంటి గందరగోళానికీ ఆస్కారం లేనటువంటివి. అయినా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలు తీవ్ర వివాదాస్పదమైంది. శిబిరాలవారీగా చీలిపోయే పరిస్థితి ఏర్పడింది. తన నిర్దిష్ట హామీల్ని నెరవేర్చటంలో యూనియన్ ప్రభుత్వం విఫలమైందన్న ఆవేదనతో వివిధ వర్గాల ప్రజలు ఆక్రోశంతో ఆరోపణలు చేస్తున్నారు. అయితే, తాము ఇచ్చిన అన్ని హామీల్ని నెరవేర్చామని లేదా నెరవేరుస్తున్నామని, తమ మీద ఆరోపణలు చేయాల్సిన కారణమంటూ లేదని యూనియన్ ప్రభుత్వ ప్రతినిధులు, కొన్ని పార్టీల నాయకులు వాదిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, ప్రధాని ప్రకటన – వీటి ద్వారా ఇచ్చిన హామీలను అధ్యయనం చేసి, వాటి అమలు పరిస్థితిని అంచనా వేసేందుకూ, యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అంతరాన్ని తొలగించి పౌర సమాజ వారధిగా వ్యవహరించి సమస్యను పరిష్కరించటంలో తోడ్పాటునందించేందుకూ ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ – ఎఫ్.డి.ఆర్) ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల బృందం (ఇండిపెండెంట్ గ్రూప్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ – ఐజిఇ)లో పార్టీలకతీతంగా సుప్రసిద్ధ ఆర్థికవేత్తలు, నిపుణులు, న్యాయకోవిదులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భాగస్వాములయ్యారు. ఈ బృందం తయారుచేసిన నివేదిక.. వాస్తవాల ఆధారంగా నిష్పాక్షికంగా అందించిన అభిప్రాయం! ఇది పరస్పర విరుద్ధ అభిప్రాయాలను సమన్వయం చేయటానికి తోడ్పడుతుంది. తెలుగేతర రాష్ట్రాలకు చెందిన జాతీయ నిపుణుల బృందం ఈ నివేదికని క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదముద్ర వేసింది.

ఇందులోని అంశాలను మీకు తెలియజేసేందుకు ఈ నివేదికను మీతో పంచుకుంటున్నాం. వాస్తవాలతో కూడిన నిర్మాణాత్మక బహిరంగ చర్చను లేవనెత్తి, సంక్లిష్టమైన, వివాదాస్పదమైన అంశాలను నిజమైన ఫెడరల్ స్ఫూర్తితో పరిష్కరించుకోవటానికి మీ నాయకత్వం, భాగస్వామ్యం ఎంతగానో దోహదం చేస్తాయని ఆశిస్తున్నాం.” ✪







# ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు చేయని పనిని పౌర నిపుణులు చేశారు



ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు చేయని పనిని పార్టీల కతీతంగా పౌర నిపుణులు చేశారని, ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం (యూనియన్) ఇచ్చిన హామీల అమలు తీరుపై అన్ని విషయాలనూ స్వతంత్ర నిపుణుల బృందం (ఐజిఇ) నిగ్గు తేల్చిందని లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రత్యేక హోదా, రెవెన్యూ లోటు, చట్టంలోని నిబంధనల్లో తప్పిదాల వల్ల ఏపీకి పన్నుల్లో వచ్చిన నష్టం వంటి అన్ని అంశాల్నీ సునిశితంగా పరిశీలించి నిజమైన సహకార ఫెడరలిజం స్ఫూర్తితో పరిష్కారాలను చెప్పారని, ఈ కమిటీని ఏర్పాటు చేయటానికి, నివేదికను రూపొందించటానికి నెలల తరబడి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ ఎంత కష్టపడ్డారో తనకు స్వయంగా తెలుసని అన్నారు. ఐజిఇ నివేదిక పుస్తకాలను విజయనగరంలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో బాబ్జీ ఆవిష్కరించారు.

రాష్ట్రంలో ప్రధాన పార్టీలు భావోద్వేగాలను రెచ్చగొట్టి ఐదున్నర కోట్ల మంది ప్రజల ప్రయోజనాలను గాలికొదిలేసి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుంటే, ఓట్లు, సీట్లు లేకపోయినా జేపీ తన మేధస్సును, ప్రతిష్ఠను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును పొరుగు రాష్ట్రాలతో ఎటువంటి వివాదం లేకుండా పరిరక్షించే ప్రయత్నం చేశారని బాబ్జీ అన్నారు. ఈ కృషిని ఏపీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రాజకీయ పార్టీలు, పౌర సమాజం నిండు మనసుతో ముందుకొచ్చి నాయకత్వాన్ని, భాగస్వామ్యాన్ని అందించి రాష్ట్రానికి అండగా నిలవాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు రాజారావు, నాగభూషణం, శిమ్మ శ్రీను, చంద్రారావు, భాస్కర్, పిఎల్ఎన్ రాజు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

# సెల్ టవర్లపై అవగాహన ఉండే అనుమతులిస్తున్నారా?




విజయనగరం పట్టణంలో అడ్డూఆపూ లేకుండా విచ్చలవిడిగా సెల్‌ఫోన్ టవర్లు దర్శనమిస్తున్నాయని, వీటిని ఏ ప్రాతిపదికన అనుమతిస్తున్నారో ప్రజలకు తెలియజేయాలని, వీటి వల్ల వచ్చే ఆరోగ్యసమస్యలపై సందేహాలను పారదర్శకంగా నివృత్తి చేయాలని యువసత్తా నియోజకవర్గ అధ్యక్షుడు రొక్కం గురునాథం, కార్యదర్శి వెంకట లక్ష్మణరావు మునిసిపల్ కమిషనర్ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లపై టవర్లను బిగించి తమకు నచ్చినరీతిలో ఫ్రీక్వెన్సీలను విడుదల చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని యువసత్తా ప్రతినిధులు అన్నారు. ఇది చిన్న విషయంలా కన్పిస్తున్న పెద్ద సమస్యని, దీనిపై మునిసిపల్ ఉద్యోగులకు కూడా అవగాహన ఉన్నట్లు కన్పించటం లేదన్నారు. ఈ సమస్యను మునిసిపల్ సమావేశంలో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. యువసత్తా సహాయ కార్యదర్శి పి.ఎల్.ఎన్ రాజు, తాత్రాజు రాజారావు, అల్లంశెట్టి నాగభూషణం, పతివాడ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

(గత సంచిక తరువాయి)

# రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వ హామీల అమలు తీరుపై స్వతంత్ర నిపుణుల బృందం (ఐజిఇ) నివేదిక (జనవరి, 2019)లోని మరో అధ్యాయం తెలుగులో స్థూలంగా..

(పూర్తి వివరాల్ని ఆంగ్ల మూలంలో చూడవచ్చు. @ www.fdrindia.org)




## ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు పన్నుల్లోనూ, ఇతరత్రానూ రాయితీలు

ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన అన్ని హామీల్లో, పారిశ్రామిక, ఆర్థిక వృద్ధిని పెంపొందించేందుకు ఉద్దేశించిన పన్ను రాయితీల అంశం అత్యంత సంక్లిష్టమైనది, వివాదాస్పదమైనది. సెక్షన్ 94(1) కింద కేంద్ర ప్రభుత్వ నిర్దిష్ట హామీ అయితే సుస్పష్టం. అంతకంటే ముఖ్యమైనది, ప్రధానమంత్రి హామీలోని 1వ పేరా (ప్రత్యేక తరగతి హోదా), 2వ పేరా (పన్ను రాయితీలు). ఈ రెండు పేరాలలో చెప్పినది, బహిరంగంగా చెప్పిన అనేక హామీలు నూతన ఆంధ్రప్రదేశ్‌కు అంతకుముందు అనేక ప్రత్యేక హోదా రాష్ట్రాలకు ఇచ్చిన, 2020 వరకు ఈశాన్య రాష్ట్రాలకు యూనియన్ కేబినెట్ మార్చి 21, 2018న ఆమోదించిన మినహాయింపుల తరహాలోనే పన్ను మినహాయింపుల్ని ఇస్తామన్న విస్పష్ట కమిట్‌మెంట్‌ను ఇచ్చాయి.

**యూనియన్ (కేంద్ర) ప్రభుత్వ దృష్టిలో.. ప్రత్యేక తరగతి హోదా, పన్ను రాయితీలు ఒకదానితో ఒకటి సంబంధం లేనివి. అయితే, యూనియన్ పూర్తి ఆదాయపు పన్ను, ప్రత్యేక పన్ను రాయితీలు సహా పెట్టుబడులపై ప్రత్యేక పన్ను మినహాయింపుల్ని ఇచ్చిన అన్ని రాష్ట్రాలూ ప్రత్యేక తరగతి హోదా రాష్ట్రాలే. ఎన్ఇఐడిఎస్ పన్ను రాయితీలు కూడా ప్రత్యేక తరగతి హోదా రాష్ట్రాలకే గ్రాంట్ అయ్యాయి.**

**భారత ప్రభుత్వ నిర్దిష్ట హామీ:**

**ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 94**

"94.(1) రెండు రాష్ట్రాలలో పారిశ్రామిక, ఆర్థిక వృద్ధి కోసం తగిన పన్ను మినహాయింపులతో సహా తగిన ఆర్థిక చర్యలను యూనియన్ ప్రభుత్వం చేపడుతుంది.

(2) రెండు రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి భౌతిక, సామాజిక, మౌలిక వనరుల విస్తరణతో సహా అనేక కార్యక్రమాలకు యూనియన్ ప్రభుత్వం అండదండలు కల్పిస్తుంది.

(3) నూతన ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజధాని నిర్మాణానికి రాజ్‌భవన్, హైకోర్టు, ప్రభుత్వ సచివాలయం, శాసనసభ, శాసన మండలి, ఇతర అవసరమైన మౌలిక వసతులు వంటి విధిగా కావలసిన సౌకర్యాల ఏర్పాటుకు యూనియన్ ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది.

(4) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం కొత్త రాజధానిని నిర్మించటానికి అవసరమైతే క్షీణించిన అటవీ భూమిని యూనియన్ ప్రభుత్వం డీ నోటిఫై చేస్తుంది."

**రాజ్యసభలో ఫిబ్రవరి 20, 2014న ప్రధానమంత్రి ఇచ్చిన భరోసా:**

"రెండోది, రెండు రాష్ట్రాలలో పారిశ్రామికీకరణకు, ఆర్థిక వృద్ధికి పన్ను రాయితీలు సహా తగిన ఆర్థిక చర్యల్ని యూనియన్ ప్రభుత్వం చేపట్టాలనేది బిల్లులో ఇప్పటికే పొందుపరచబడి ఉంది. కొన్ని ఇతర రాష్ట్రాలకు అందిస్తున్న తరహాలోనే ఈ మినహాయింపులు ఉంటాయి.

**పురోగతి/పరిణామాలు**

**తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పర్యవసానంగా ఈ దిగువ కారణాల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి కుంటుపడింది:**

- ప్రభుత్వ రంగ సంస్థలు, భారీ పరిశ్రమలు, విద్య, పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ & డి) సంస్థల పరంగా వనరులను నష్టపోవటం
- పారిశ్రామికీకరణ తక్కువ స్థాయిలో ఉండటం
- పారిశ్రామికరంగంలో ఆ ప్రాంతం వెనుకబడి ఉండటం
- కీలకమైన మౌలిక వసతుల లోటు
- ఎగుమతుల్లో వాటా తక్కువ కావటం
- రెవెన్యూ లోటు
- తక్కువ అక్షరాస్యతా శాతాలు

పారిశ్రామికాభివృద్ధికి ఊపునివ్వటానికి ఇతర కొన్ని రాష్ట్రాలకు ఇస్తున్నట్టు "పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక రాయితీల్ని" ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యూనియన్ ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ఈ ఆర్థిక, పన్ను రాయితీలు రాష్ట్రంలో పారిశ్రామికీకరణను వేగవంతం చేసి, అసమానతల్ని సరిచేయగలుగుతాయి.

**సెక్షన్ 94 (1) కింద రాయితీలకు ప్రత్యేక ప్యాకేజీ కోసం అభ్యర్థన**

- ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం (ఏపిఆర్ఎ), 2014 సెక్షన్ 94 (1) కింద రాయితీలకు ప్రత్యేక ప్యాకేజీని కోరుతూ భారత ప్రభుత్వానికి ప్రతిపాదనను ఇవ్వడం జరిగింది.
- ఈ ప్రతిపాదనను వేగవంతం చేయటం కోసం జూన్ 26, 2014న యూనియన్ వాణిజ్య శాఖా మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌కు ఒక లేఖను రాసింది.
- ప్రతిపాదనను పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ యూనియన్ ఆర్థిక మంత్రి శ్రీ అరుణ్ జైట్లీకి కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 26, 2014న లేఖ రాసింది. యూనియన్ ప్రభుత్వం నుంచి సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు.

**సెక్షన్ 94 (2) కింద ప్రత్యేక ప్యాకేజీ కోసం అభ్యర్థన**

ఏప్రిల్ 01, 2015 నుంచి మార్చి 31, 2020 వరకు రాష్ట్రంలోని వెనుకబడిన ఏడు జిల్లాల్లో ఏర్పాటు చేసి ఏ ఉత్పత్తి పరిశ్రమకైనా 15 శాతం అధిక అదనపు డిప్రీసియేషన్, ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 32(1)(2ఎ), సెక్షన్ 32ఎడి కింద పరిశ్రమ, యంత్రాల వ్యయంపై 15 శాతం పెట్టుబడి అలవెన్స్ అందించనున్నట్లు సిబిడిటి (భారత ప్రభుత్వ ప్రత్యక్ష పన్నుల బోర్డు) సెప్టెంబర్, 2016లో నోటిపై చేసింది.

- ఆ తర్వాత, పరిశ్రమ, యంత్రాలపై మిగతా 6 జిల్లాల్లోని వెనుకబడిన మండలాల్లో 15 శాతం పెట్టుబడి రాయితీ ఇవ్వాలని నవంబర్ 29, 2016న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిబిడిటి ఛైర్‌పర్సన్‌కు, భారత ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శికి లేఖ రాశారు.

**రాయితీ ప్యాకేజీలను పోల్చిచూడటం**

ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు, జమ్మూ, కాశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లకు ఇచ్చిన రాయితీ ప్యాకేజీలను పోల్చి చూస్తే ఈ దిగువ అంశాలు తేటతెల్లమవుతాయి:

**ఈశాన్య రాష్ట్రాలు/ జమ్మూ, కాశ్మీర్/ ఉత్తరాఖండ్ మరియు హిమాచల్ ప్రదేశ్‌లలోలాగా ఈ కింది ఆర్థిక మినహాయింపుల్ని ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వలేదు..**

- ఎక్సయిజ్ సుంకం
- ఆదాయపు పన్ను
- క్యాపిటల్ రాయితీ (ప్లాంట్ మరియు యంత్రాల మీద)
- మూల పెట్టుబడి మీద ఇన్సూరెన్స్ ప్రీమియం
- వర్కింగ్ క్యాపిటల్ రుణాలపై వడ్డీ మినహాయింపులు
- రవాణా/సరకు రాయితీలు

**ఈశాన్య రాష్ట్రాలు/ జమ్మూ, కాశ్మీర్/ ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లలోలా ఆంధ్రప్రదేశ్‌లో ఈ కింది మౌలిక వసతుల సాయం అందించలేదు..**

- అభివృద్ధి కేంద్రాల (గ్రోత్ సెంటర్ల) పథకం
- సమీకృత మౌలిక వసతుల అభివృద్ధి కేంద్రాలు (ఐఐడిసి)

**ఈశాన్య రాష్ట్రాలు/ జమ్మూ, కాశ్మీర్/ ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో మౌలిక వసతులకు 90:10 (భారత ప్రభుత్వం: రాష్ట్ర ప్రభుత్వం) సాయం అందిస్తే, ఆంధ్రప్రదేశ్‌కు 50:50 సాయం ప్రకటించారు**

- వస్త్ర పరిశ్రమ మంత్రిత్వ శాఖ రాయితీల పథకం

**మౌలిక వసతుల అభివృద్ధిలో తోడ్పాటుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు ఈశాన్య రాష్ట్రాలు/ జమ్మూ, కాశ్మీర్/ ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లలా ప్రత్యేక మినహాయింపుని ఇవ్వలేదు. దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఇచ్చినట్టే ఇచ్చారు**

- ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కులు
- మెగా ఫుడ్ పార్కులు

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక, ఆర్థిక వృద్ధి కోసం.. అంతకుముందున్న ప్రత్యేక తరగతి హోదా రాష్ట్రాలకు ఇచ్చిన ప్రత్యేక మినహాయింపుల తరహాలోనే పారిశ్రామికీకరణకు అవసరమైన ఆర్థిక రాయితీల్ని, ఎస్‌జిఎస్‌టి, ఐజిఎస్‌టి రీఫండ్‌కు భర్తీ ఏర్పాటును ఆంధ్రప్రదేశ్‌కూ వర్తింప చేయాలని

రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖను ఫిబ్రవరి 28, 2018న కోరింది.

ఈశాన్య రాష్ట్రాల పారిశ్రామిక అభివృద్ధి స్కీము (ఎన్ఇఐడిఎస్), 2017కు (ఎనెగ్జర్-19) రూ.3,000 కోట్ల ఆర్థిక వ్యయంతో మార్చి 2020 వరకు కేంద్ర కేబినెట్ మార్చి 21, 2018న ఆమోదముద్ర వేసింది. అంతకుముందు రెండు స్కీముల కింద ఉన్న కేటాయింపుల్ని గణనీయంగా పెంచి ఎన్ఇఐడిఎస్‌గా రూపొందించారు. ఈ స్కీము కింద సిక్కిం సహా ఈశాన్య రాష్ట్రాల్లో కొత్తగా ఏర్పాటు చేసే పారిశ్రామిక విభాగాలకు ఈ దిగువ మినహాయింపుల్ని ఇస్తారు:

- రుణ సదుపాయానికి యూనియన్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ రాయితీ (సిసిఐఐఎసి)
- కేంద్ర వడ్డీ రాయితీ (సిఐఐ)
- కేంద్ర సమగ్ర బీమా రాయితీ (సిసిఐఐ)
- వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) రీఇంబర్స్‌మెంట్
- ఆదాయపు పన్ను (ఐటి) రీఇంబర్స్‌మెంట్
- రవాణా రాయితీ (టిఐ)
- ఎంప్లాయిమెంట్ రాయితీ (ఇఐ)

మార్చి 2018లో ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చిన ఎన్ఇఐడిఎస్ తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌కు కూడా పన్ను రాయితీల్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించింది.

ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన అన్ని హామీల్లో, పారిశ్రామిక, ఆర్థిక వృద్ధిని పెంపొందించేందుకు ఉద్దేశించిన పన్ను రాయితీల అంశం అత్యంత సంక్లిష్టమైనది, వివాదాస్పదమైనది. సెక్షన్ 94(1) కింద యూనియన్ ప్రభుత్వ నిర్దిష్ట హామీ అయితే సుస్పష్టం. అంతకంటే ముఖ్యమైనది, ప్రధానమంత్రి కమిట్‌మెంట్‌లోని 1వ పేరా (ప్రత్యేక తరగతి హోదా), 2వ పేరా (పన్ను రాయితీలు). ఈ రెండు పేరాలలో చెప్పినది, బహిరంగంగా చెప్పిన అనేక హామీలు నూతన ఆంధ్రప్రదేశ్‌కు అంతకుముందు అనేక ప్రత్యేక హోదా రాష్ట్రాలకు ఇచ్చిన, 2020 వరకు ఈశాన్య రాష్ట్రాలకు యూనియన్ కేబినెట్ మార్చి 21, 2018న ఆమోదించిన మినహాయింపుల తరహాలోనే పన్ను మినహాయింపుల్ని ఇస్తామన్న విస్పష్ట కమిట్‌మెంట్‌ను ఇచ్చాయి. రాష్ట్ర విభజన పరిస్థితులు, పరిశేష ఆంధ్రప్రదేశ్‌లో సాపేక్షంగా తక్కువ పారిశ్రామికీకరణ, విస్పష్ట హామీలు, అన్ని పార్టీల రాజకీయ ప్రచారాలు, మీడియా చేసిన ప్రచారం.. వీటన్నిటి వల్ల పన్ను రాయితీలపై రాష్ట్రంలో భారీ ఆశలు, అలజడి నెలకొంది.

యూనియన్ ప్రభుత్వ దృష్టిలో, ప్రత్యేక తరగతి హోదా, పన్ను రాయితీలు ఒకదానితో ఒకటి సంబంధం లేనివి. అయితే, యూనియన్ పూర్తి ఆదాయపు పన్ను, ప్రత్యేక పన్ను రాయితీలు సహా పెట్టుబడులపై ప్రత్యేక పన్ను మినహాయింపుల్ని ఇచ్చిన అన్ని రాష్ట్రాలూ ప్రత్యేక తరగతి హోదా రాష్ట్రాలే. ఎన్ఇఐడిఎస్ పన్ను రాయితీలు కూడా ప్రత్యేక తరగతి హోదా రాష్ట్రాలకే గ్రాంట్ అయ్యాయి. ఈ కారణంగానే, ప్రత్యేక తరగతి హోదా రాష్ట్రాలు, పన్ను రాయితీలు ఒకటేనన్న భావన కాలేజీ యువతలో, పాఠశాల విద్యార్థుల్లో, పెద్దసంఖ్యలో ఉన్న నిరుద్యోగ యువతలో బలంగా నాటుకుని పోయింది.

ఒక పోటీ ఫెడరల్ వ్యవస్థలో యూనియన్ ప్రభుత్వానికి ఈ అంశానికి సంబంధించి స్పష్టంగా కొన్ని సమస్యలుంటాయి. ముఖ్యంగా, మూడు వాస్తవ సవాళ్లను యూనియన్ ఎదుర్కొంటోంది.

మొదటిది, పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న అనేక రాష్ట్రాలు ఇదే తరహా డిమాండ్లను చేస్తాయి. రెండోది, ఆంధ్రప్రదేశ్‌కి పన్ను రాయితీల్ని ఇస్తే, తమ వద్ద పెట్టుబడులు, పరిశ్రమలు తరలిపోతాయేమోనని పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే గళం విప్పాయి. మూడోది, ప్రస్తుతమున్న పదకొండు ప్రత్యేక హోదా రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ చాలా ఎక్కువ జనాభాను కలిగి ఉంది. ఈ పదకొండు రాష్ట్రాలను కలిపితే మొత్తం జనాభా 8 కోట్లు ఉంటే, ఆంధ్రప్రదేశ్ ఒక్కటే 5 కోట్ల జనాభాను కలిగి ఉంది.

**సిఫార్సులు :**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పెట్టుబడులకు పన్ను రాయితీలు సంక్లిష్టమైన, చతురమైన, వివాదాస్పదమైన అంశం. ఈ సంక్లిష్ట అంశాన్ని పరిష్కరించటానికి పలు మార్గాలను పరిగణలోకి తీసుకోవచ్చు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, రాయితీలను ఆ ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయటం అందులో ఒక ఆచరణయుక్తమైన మార్గం. చాలా ప్రత్యేక తరగతి రాష్ట్రాలకు ఇచ్చినట్లు పూర్తి పన్ను మినహాయింపుల్ని కాకుండా.. ఇప్పుడిస్తున్న రాయితీలకంటే గణనీయంగా పెంచి పన్ను మినహాయింపు ప్రయోజనాల్ని మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు విస్తరింపచేయటం రెండో పద్ధతి. మూడోది, ఇతర రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మిగిలిన భారతదేశంలో గుర్తించిన వెనుకబడిన ప్రాంతాలకు కూడా పూర్తి పన్ను రాయితీ ప్రయోజనాల్ని అందించటం.

ఇదేసమయంలో యూనియన్ ప్రభుత్వం అదనంగా ఆంధ్రప్రదేశ్‌లో 100 శాతం ఆర్థిక సాయంతో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధికనుగుణంగా చేపట్టాలి. సహజ వనరులు, స్థానిక నైపుణ్యాలు, మార్కెట్ సామర్థ్యం ఆధారం చేసుకుని.. పారిశ్రామిక మౌలిక వసతుల ఆధునీకరణ పథకం (ఐఐయుఎస్), మెగా ఫుడ్ పార్క్ పథకం, సమీకృత మౌలిక సదుపాయాల అభివృద్ధి (ఐఐడి) పథకం వంటి సముదాయ పథకాల తరహాలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టవచ్చు. ✪

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్యేలకు ఏం పని?




శాసనసభలో చట్టాలు చేయాల్సిన ఎమ్మెల్యేలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏం పని? అని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం ఇంఛార్జి వెంకటరమణబాబు ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారుల్లా వ్యవహరించటం, అధికారులేమో రాజకీయాలు చేయటం వల్ల ప్రజలు రాజకీయాలంటేనే అసహ్యించుకుంటున్నారని, ఉచితాలు, ఓటుకు నోటు వంటి తాయిలాల ద్వారా అయినకాడికి దండుకుందామనుకుంటున్నారు తప్ప.. విలువను గుర్తించి ఓటు వేయాలనుకోవటం లేదన్నారు. నిజాయతీగల అధికారులు ఈ బాధలు తట్టుకోలేక సెలవల్లో వెళుతున్న సందర్భాలున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్యేలు, ఇతర రాజకీయ బ్రోకర్ల జోక్యాన్ని నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన నిరసన వ్యక్తం చేశారు. చిన్న సర్టిఫికెట్లు, పట్టాదారు పాసు పుస్తకం, ఇతర సేవలు కావాలన్నా రాజకీయ నాయకుల వత్తాసు కావాల్సి వస్తోందని లేదా లంచమివ్వాల్సి వస్తోందని.. ఎమ్మెల్యేలకు, ప్రభుత్వ కార్యాలయాలకు మధ్య సంబంధం లేకుండా చేసి, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరి రికమండేషనూ లేకుండా పనులు జరిగేలా చేసేందుకు లోక్‌సత్తా ప్రతిపాదించిన 'పౌర సేవల' చట్టాన్ని అమలు చేయాలన్నారు.

# సమాజహితంలోనే వ్యక్తి ప్రయోజనమూ దాగి ఉంది

ఆత్మన్యూనతతో అణగారిపోతున్న భారతజాతికి వివేకానందుడు ఆత్మవిశ్వాసాన్ని అందించారని, ఆయన మాటలు నేటికీ కోట్లాది భారతీయులను ఉత్తేజపరుస్తున్నాయని, అయితే వివేకానందుని మాటల సౌందర్యాన్నే కాకుండా అంతరార్థాన్ని గ్రహించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. శ్రీ రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో అనపర్తిలోని జీబీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగిన వివేకానంద జన్మదినోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

ఆచార వ్యవహారాలను పాటించటంకన్నా సమాజహితాన్ని కోరుకోవడమే నిజమైన ఆధ్యాత్మికత అని, సమాజహితంలోనే వ్యక్తి ప్రయోజనం దాగి ఉందని జేపీ అన్నారు. సమాజంలో పదిమంది ఉన్నతికి పాటుపడటమే నిజమైన ఆధ్యాత్మికత అని వివేకానందుడు చాటారని గుర్తు చేశారు. భారతజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి వివేకానంద చాటారని, కానీ ఈవేళ మనదేశం 49 పెద్ద దేశాలలో అన్ని ప్రధాన రంగాలలో అట్టడుగు స్థానాల్లో ఉందన్నారు. 14 నుంచి 18 ఏళ్ల వయసులోని వారిలో సగం మందికి గడియారం చూసి సమయం చెప్పే శక్తి కూడా లేకపోతే ఇక మన యువభారతం ఎలాంటి ఘనకార్యాలను సాధించగలదు? అని ప్రశ్నించారు. నిత్యం ఆత్మవంచనతో బతుకుతున్న మనకు.. జాతిని చైతన్య పరిచిన మహానుభావులు వివేకానంద, గాంధీజీల గురించి మాట్లాడే అర్హత ఉందా? అని ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. నిజమైన గొప్పతనాన్ని నిర్మించకపోతే, సమర్థత, పరిజ్ఞానం ఉన్నవారిని గుర్తించి ప్రోత్సహించే వాతావరణం సమాజంలో, రాజకీయంలో లేకపోతే.. దేశ పునాదులు గుల్లబారతాయన్నారు.

వివేకానందుడి తత్వాలను వినడం, నినదించడం చాలదని, వాటిని జీవితానికి అన్వయించుకుని స్థానికంగా అమలు చేయటం అవసరమని జేపీ అన్నారు. "ప్రపంచానికి జ్ఞానాన్ని అందించిన భారతదేశం ఎప్పుడూ మేలుకొనే ఉంటుందని వివేకానందుడు చెప్పారు. భారతదేశంలోని యువతీ యువకులారా, అత్యంత మేధాసంపత్తి ఉన్న విజ్ఞానులారా! మీలో నివురుగప్పి ఉన్న శక్తిని బయటకు తీసేందుకు పోరాడండి, దేశ ఔన్నత్యానికి తోడ్పడండి" అని పిలుపునిచ్చారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి కోసం ఉపయోగించే దిశగా, సమాజానికి మంచి చేయటం ద్వారా ఉపాధి పొందే దిశగా యువత పయనించాలని కోరారు.

మానసిక వైద్యుడు డా॥ కర్రి రామారెడ్డి (మానస) మాట్లాడుతూ, వివేకానందుని బోధనలు మనసులోకి వెళ్లే విధంగా విద్యార్థి దశ నుంచే బోధించాలన్నారు. ఇందుకు అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. స్వామి వివేకానందుని వీరత్వాన్ని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని భారతీయం సంస్థ అధ్యక్షురాలు సత్యవాణి విజ్ఞప్తి చేశారు. వివేకానందుడు దేశానికి త్యాగం, సేవ అనే రెండు గొప్ప గుణాలను అందించారని, వాటిని



ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రామకృష్ణా మఠం రాజమహేంద్రవరం అధ్యక్షుడు స్వామి వినిశ్చలానందజీ మహరాజ్, తదితరులు ప్రసంగించారు.

అనపర్తి రామకృష్ణ సేవాసమితి పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేపీ, సత్యవాణి, రామారెడ్డిలకు జీవన సాఫల్య పురస్కారాలను అందించారు. రామకృష్ణా మిషన్ సభ్యుడు ముదే దుర్గాప్రసాద్ రామకృష్ణ సేవాసమితిని ఏర్పాటు చేసి వివేకానందుని ఆశయాల సాధన కోసం చేస్తున్న కృషిని సభ ప్రశంసించింది. సామాన్య కుటుంబంలో పుట్టినా స్వయంకృషితో ఎదిగి సమాజసేవకు తన వంతు ప్రయత్నం చేస్తున్నారన్నారు. విద్యాసంస్థల అధినేత తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), తాడి రామారెడ్డి మాష్టారు, ఉత్తరాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్తు కన్వీనర్ తిరుమలరాజు జగన్నాథరాజు, పారిశ్రామికవేత్తలు మేడపాటి రామలింగారెడ్డి, సత్తి లక్ష్మణరెడ్డి, రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సబ్బెళ్ల అమ్మిరెడ్డి, జాతీయ కోళ్ల రైతు సంఘం నాయకుడు తేతలి ఉపేంద్రరెడ్డి, వైసీపీ నేత డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి, జీవీఆర్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి మల్లిడి రామకృష్ణారెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, ఐఎల్‌టీడీ ఫ్యాక్టరీ మేనేజర్ సునీల్ నాయర్, సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), ట్రస్ట్ ఛైర్మన్ సత్తి బుల్లి స్వామిరెడ్డి, మాజీ సర్పంచ్ సత్తి సూర్య బ్రహ్మానందరెడ్డి, తాడి చంద్రశేఖరరెడ్డి, తేతలి సుందరరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ✿

# పోస్టాఫీసులను నిరంతర ఓటరు నమోదు కేంద్రాలుగా చేయాలి: జేపీ



ఓటరు జాబితాల్లో అవకతవకల్ని నియంత్రించటానికి పోస్టాఫీసులను శాశ్వత ఓటరు నమోదు కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని. ఓటరు నమోదును దానంతటది జరిగే నిరంతర ప్రక్రియగా చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పునరుద్ఘాటించారు. పట్టణ ఓటర్ల జాబితాల్లో పలు అవకతవకలున్నట్లు ఇటీవల ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా హైదరాబాద్‌లో నిర్వహించిన నమూనా సర్వేలో కూడా తేలిందన్నారు. ఓటరు నమోదుకు పోస్టాఫీసుల్ని శాశ్వత నోడల్ ఏజెన్సీలుగా చేసేలా ఎన్నికల సంఘంపై ఒత్తిడి తేవాలని, ఇందుకు అన్ని పార్టీలూ, సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు కూడా కలిసిరావాలని అన్నారు.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, పౌర నిఘా వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు చైతన్య కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లోని ఆర్.కె స్టడీ సెంటర్‌లో ఆయన ప్రారంభించారు. ఓటు వృధా సహా పలు అంశాలపై ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రజలకసందేహాలకు సమాధానాలిచ్చారు.

ప్రజాస్వామ్యంలో ప్రజల చేతుల్లో ఉన్న రెండు ఆయుధాలలో ఓటు ప్రధానమైనదని, దీన్ని సక్రమంగా ఉపయోగించుకుంటే అద్భుతాల్ని సాకారం చేసుకోవచ్చని జేపీ అన్నారు. ఓటరుకు ఓటు విలువ తెలియకుండా మాత్రం మార్పు రాదన్నారు. దేశంలో 90 శాతం మందికి ఓటు హక్కు గురించి అవగాహన లోపించిందన్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే వ్యవస్థల నిర్మాణం లేకపోవటం, ప్రజల్లో ఓటుపై చైతన్యం కొరవడమే ఇప్పుడు దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యలకు మూలంగా ఉందన్నారు. జవాబుదారీతనం లేకుండా మన వ్యవస్థ నిర్మాణం జరగడం వల్ల మన దేశంలో చిన్న చిన్న పనులు జరగడం కూడా గగనంగా మారిందని, సర్పంచ్ ఎన్నికలు కూడా ముఖ్యమంత్రి చుట్టూ తిరుగుతున్నాయని అన్నారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, నిరాశ చెందకుండా నిజాయతీగా పాలించేవారిని ఎన్నుకోవాలని జేపీ పిలుపునిచ్చారు. అశ్రద్ధ చూపకుండా.. కులం, మతం, సినీ గ్లామర్‌లకు అతీతంగా సరైనవారికి ఓటు వేయాలన్నారు. ఓటును డబ్బుతోనో, మద్యంతోనో, ఇతర తాయిలాలతోనో కొనాలని మోసగాళ్లు, మాయగాళ్లు చూస్తారని, అమాయకంగా ఓటు అనే ఆయుధాన్ని అమ్ముకుంటే ప్రజాస్వామ్యానికి, మన జీవితాలకి చేటు వస్తుందన్నారు. రాజకీయ పార్టీలు ఇచ్చే వాగ్దానాలను గుడ్డిగా నమ్మవద్దని, వాటి సాధ్యాసాధ్యాల గురించి అభ్యర్థులను ప్రశ్నించాలని అన్నారు. రిజర్వేషన్లే అన్నిటికీ పరిష్కారమని ప్రస్తుతం నేతలంతా మోసపూరిత రాజకీయాలు చేస్తున్నారని, ఏ అంశాలు చర్చకు రావాలో, ఏ ప్రాతిపదికన పార్టీల్ని, అభ్యర్థుల్ని ఎన్నుకోవాలో అవి మాత్రం చర్చకు రావటం లేదన్నారు. తమ పిల్లల్ని చదివించటానికి తల్లిదండ్రులు శక్తికి మించి త్యాగాలు చేస్తున్నా, చాలామంది పిల్లలకు సరైన చదువు అందటం లేదన్నారు. 14–15 ఏళ్ల వయసు పిల్లల్లో వాచీ చూసి సమయం చెప్పే శక్తి కూడా లేని స్థాయి చదువులు చెబుతున్నారన్నారు. సరైన విద్య, వైద్యం అందాలని ప్రజల నుంచి పెద్దఎత్తున డిమాండ్లు రావాలన్నారు. ఇలా మనకు తరతరాలపాటు ఉపయోగపడే ఎజెండాను ఓటుతో ముడిపెట్టి ఆ హక్కును వినియోగించుకోవాలన్నారు. అధికారం పొందిన పార్టీలు మేనిఫెస్టోల అమలులో కొర్రీలు పెడుతూ, జాప్యాలు చేస్తుంటే నిలదీయాల్సిన అవసరముందన్నారు.

'మీరు ఐఏఎస్ అధికారిగా ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ఎందుకు వదులుకున్నారని' విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ సుగుణ అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ, 'పట్టాలు సరిగా లేకపోతే రైలు ఇంజిన్ డ్రైవర్ ఏమి చేయగలడు' అని జేపీ అన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ పి.చంద్రమౌళి, రాష్ట్ర సమన్వయకర్త యు. మాచిరాజు, నగర సమన్వయకర్త ఎంవీ రాజగోపాల్, లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ, లోక్‌సత్తా జనబలం వర్కింగ్ ఎడిటర్ డి. సోమసుందరం, ఆర్.కె స్టడీ సెంటర్ అధినేత రామకృష్ణ, సీఎస్ కామేశ్వరరావు, బి.కృష్ణచైతన్య, అబ్దుల్ రజాక్, వి.ఎస్.ఎస్ మూర్తి తదితరులతో కలిసి ఓటరు చైతన్య కరపత్రాన్ని జేపీ ఈ సందర్భంగా విడుదల చేశారు. ✪


"నిజాలు పవిత్రం, వ్యాఖ్య ఇష్టానుసారం - నిజాలు ఆధారంగా చేసే వ్యాఖ్య అన్నిటికన్నా పవిత్రం"

- సి.పి. స్కాట్

STATE REORGANISATION

UNION'S COMMITMENTS TO ANDHRA PRADESH

STATUS REPORT




INDEPENDENT GROUP OF EXPERTS

FOUNDATION FOR DEMOCRATIC REFORMS

Posting Date 07-02-2019

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on February 1st 2019




Book-Post

PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times

Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC "X" Roads, Hyderabad